- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
26-05-2026

సంపుటి : 01 సంచిక : 65 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 65 NAMASTEY MAHAAPRABHA

## బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ నిషేధం



- అలాగే జంతు బలులు కూడా నిషిద్ధం
- అధికారులను ఆదేశించిన యూపి సిఎం

**లక్నో మే 25 (మహా ప్రభ)**

దేశవ్యాప్తంగా బక్రీద్ వేడుకలకు సన్నాహాలు జరుగుతున్న వేళ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం ప్రకటించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. బక్రీద్ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో నమాజ్‌ల నిర్వహణ, జంతుబలిని అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు లఖ్‌నవూలో-మిగతా 3 లో

## తెలంగాణలో రోహిణీ కార్తె ఎఫెక్ట్..



- తెలంగాణలో 46.5 దాటిన ఉష్ణోగ్రతలు
- కుమురం భీం నుంచి సూర్యాపేట వరకు రెడ్ అలర్ట్
- మరో మూడు రోజులు ఇదే తీవ్రత..
- ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరిక

**హైదరాబాద్, మే 25 (మహా ప్రభ)**

తెలంగాణ వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. రోహిణీ కార్తె ప్రవేశించిన వేళ భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. తెలంగాణ ప్రణాళిక సంఘం మే 25న విడుదల చేసిన గరిష్ట ఉష్ణోగ్రతల వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. చాలా ప్రాంతాల్లో ఎండ తీవ్రత -మిగతా 3 లో



## మహిళా సాధికారతకు 'ప్రజా ప్రభుత్వం' పెద్దపీట

- రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలతో సరికొత్త రికార్డు
- వడ్డీ లేని రుణాల పరిమితి రూ.10 లక్షలకు పెంపు
- ఒకేసారి 8 వేల స్వయం సహాయక సంఘాల భవనాలకు భూమిపూజ
- కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్ మే 25 (మహా ప్రభ)**

రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 8,000 సంఘాల భవన నిర్మాణాలకు వర్చువల్ విధానంలో జరిగిన భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న -మిగతా 3 లో



## పెట్రో మంట

- మరోసారి పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు
- పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు
- పది రోజుల్లో నాలుగో సారి ధరలకు రెక్కలు
- సామాన్యుడిపై పెనుభారం.. మోడీ సర్కారుపై జనాగ్రహం

**న్యూఢిల్లీ మే 25 (మహా ప్రభ)**

కేంద్రంలోని మోడీ సర్కారు దేశ ప్రజలకు విడతలవారీగా షాక్‌లు ఇస్తోంది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచింది. పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరగడంతో సామాన్య ప్రజలకు అదనపు భారం తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం తాజాగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. లీటర్ పెట్రోల్‌పై రూ.2.61, లీటర్ డీజిల్‌పై రూ.2.71 పెంచింది. పెరిగిన ఈ కొత్త ధరలు సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి

-మిగతా 3 లో

## బిఆర్ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

ప్రతి ఇంటికీ మంచి నీరు అందించి తీరుతాం



- నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు ఒక్కటైనా కట్టారా
- అలా చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- సర్ ప్రక్రియతో జాగ్రత్తగా ఉండాల్సిందే
- కూకట్‌పల్లి కార్యకర్తల భేటీలో బిఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్, మే 25 (మహా ప్రభ)**

బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైదరాబాద్ సిటీలో 24 గంటల తాగునీటిని సరఫరా చేస్తామని మాజీమంత్రి కెటిఆర్ అన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చిన తీరుగానే ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణకు 24 గంటల కరెంట్ ఇచ్చింది కేసీఆరే అని.. హైదరాబాద్ లో 24 గంటల తాగునీరు ఇచ్చేది కూడా కేసీఆరే అని వెల్లడించారు. కాంగ్రెస్ పరిపాలన గురించి అవగాహన ఉంది కాబట్టే నగర ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని మాజీ మంత్రి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ జనరల్ బాడీ మీటింగ్ -మిగతా 3 లో



## పదవుల కోసం వారు అక్కర్లేదు

- పార్టీ కోసం, ఏపీ అభివృద్ధి కోసం పనిచేయండి
- ఎదుటి వారి విమర్శలను సహించడానికి లేము
- అవసరమైతే తాట తీస్తాం: పవన్ హెచ్చరిక

**అమరావతి, మే 25 (మహా ప్రభ)**

:పదవులు వచ్చిన తర్వాత చాలా మంది జనసేన నాయకులు మెత్తబడి పోయారని, అలాంటి నాయకులు జనసేనకు అవసరం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 'మీ ఎదుగుదల కోసం నన్ను వాడుకోవద్దు. శత్రువులు బయట ఎక్కడో లేరు.. మన పార్టీలోనే ఉన్నారు' అంటూ పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేనలో ఉండగలిగేవాళ్లు మాత్రమే పార్టీలో ఉండండి అని స్పష్టం చేశారు. తాను టీడీపీ కోసం కాదు.. రాష్ట్రం కోసం సర్దుకుపోతున్నా.. అంటూ వ్యాఖ్యానించారు. ఇకపై జనసేన కట్టుదిట్టంగా వ్యవహరిస్తుందని, వ్యక్తిగతంగా విమర్శిస్తే అదే స్థాయిలో

-మిగతా 3 లో

## కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

ఆదానీ, అంబానీలను మించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు
- సోలార్ పవర్, పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ఎదగాలి
- రుణపరిమితి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నాం
- రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటుకు సహకారం
- వర్చువల్ గా 8వేల స్వయం సహాయక భవనాలకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, మే 25 (మహా ప్రభ)**

తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి -మిగతా 3 లో








## మోదీ..గ్రేట్

- భారత్ అతి శక్తివంతమైన దేశమన్న ట్రంప్
- మోదీ నాయకత్వంలో వేగంగా అభివృద్ధి
- మోదీకి ఏ సాయం కావాల్సినా చేస్తాం
- నేరుగా నాకే ఫోన్ చేయవచ్చు
- భారత్ అమెరికాకు నమ్మకమైన మిత్రుడంటూ కామెంట్
- ప్రధానిని ప్రశంసలతో ముంచెత్తిన పెద్దన్న

3

## ఒక్క రక్తపు చుక్కతో క్యాన్సర్ నిర్ధారణ..



3

## పాకిస్తాన్‌తో విడదీయరాని బంధం ఉంది : జిన్‌పింగ్



**బీజింగ్ న్యూఢిల్లీ, మే 25 (మహా ప్రభ)**
పాకిస్తాన్‌తో తమకు విడదీయరాని బంధం ఉందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. పాకిస్తాన్ ప్రధాని చైనా పర్యటనలో భాగంగా సోమవారం బీజింగ్‌లో ఆ దేశాధ్యక్షుడితో భేటి అయ్యారు. చైనా పరిగణించే ప్రత్యేక దేశాల సమూహంలో పాకిస్తాన్ ఒకటి. పాక్ సన్నిహిత ఆర్థిక, వాణిజ్య, భద్రతా సహకారంతో కూడిన సంబంధాలతో, అన్ని కాలాలకు అనువైన వ్యూహాత్మక భాగస్వామి అని జిన్‌పింగ్ అన్నారు. కాగా, గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్ భవనంలో పాక్ ప్రధాని షరీఫ్‌కు చైనా అధ్యక్షుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ షరీఫ్‌ని ఓల్డ్ ఫ్రెండ్ అని పిలిచారు. పాక్ -- చైనా ఇరు దేశాలు దశాబ్దాలుగా ఒకదానికొకటి అర్థం చేసుకుని, విశ్వసించి, మద్దతు ఇచ్చుకుంటూ, విడదీయరాని సాంప్రదాయ స్నేహాన్ని ఏర్పరచుకున్నాయని జిన్‌పింగ్ అన్నారు. అంతర్జాతీయ పరిస్థితులు ఎలా ఉన్నా.. చైనా ఎల్లప్పుడూ చైనా -- పాకిస్తాన్‌ల అభివృద్ధికి, దౌత్య సంబంధాలకే ప్రాధాన్యతనిస్తుందని ఆయన అన్నారు. ఉమ్మడి భవిష్యత్తుతో మరింత ఐక్యతతో చైనా-పాకిస్తాన్ సమాజాన్ని నిర్మించడానికి ఇస్లామాబాద్‌తో కలిసి పనిచేయడానికి బీజింగ్ సిద్ధంగా ఉంది అని జిన్‌పింగ్ అన్నారు. ఈ సందర్భంగా షరీఫ్ పాక్- చైనాలు సాటిలేని సంబంధం కలిగిన రెండు ఉక్కు సోదర దేశాలుగా అభివర్ణించారు.

### యూపీలో బక్రీద్ వేళ రోడ్లపై
## నమాజ్, జంతుబలి నిషేధం..
**- సీఎం యోగి ఆదిత్యనాథ్ వార్నింగ్**

**న్యూఢిల్లీ, మే 25 (మహా ప్రభ)**



దేశంలోని ముస్లింలంతా బక్రీద్‌కు సిద్ధమవుతున్న వేళ ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక సూచనలు చేశారు. యూపీలోని రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాలలో నమాజ్ చేయడాన్ని, జంతు బలులను నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూపీలో బక్రీద్ నిర్వహణపై ఆదివారం సీఎం యోగి.. ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించారు.అనంతరం బక్రీద్‌పై అధికారులకు కీలక సూచనలు చేశారు. పది అంశాలను సూచిస్తూ, వాటిని అమలు చేయాలన్నారు. ఆయన ఆదేశాల ప్రకారం.. మసీదులలో మినహా ఎక్కడా నమాజ్ చేయడానికి వీల్లేదు. రోడ్లపై లేదా పబ్లిక్ ప్లేసులు వంటి ఎలాంటి బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ చేయకూడదు. అలాగే, జంతు బలులు కూడా నిషేధం. రోడ్లను బ్లాక్ చేయకూడదు. ఒకవేళ ప్రార్థనలు చేసే వాళ్లు ఎక్కువ సంఖ్యలో ఉంటే, షిఫ్టుల వారీగా చేసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో జంతు బలులు చేయకూడదు. అలాగే, నిషేధించిన జంతువులను వధించినా కూడా చర్యలు తీసుకుంటారు. జంతుబలుల తర్వాత ఆ ప్రదేశాల్ని పూర్తి పరిశుభ్రంగా ఉంచాలి. ఎలాంటి అపరిశుభ్రతకు తావివ్వకూడదు. చెత్త, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకూడదు. అలాగే, అవాంఛిత ఘటనలకు పాల్పడేవారిపై, శాంతి భద్రతలకు విఘాతం కల్పించేవారిపై కఠినంగా వ్యవహరించాలి. తగినంతగా భద్రతను మోహరించాలి. ముఖ్యంగా సున్నిత ప్రాంతాలను గుర్తించి భద్రత పెంచాలి. సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతరం శాంతి భద్రతల్ని పర్యవేక్షించాలి.

## నేషనల్ హైవే అథారిటీకి దక్కని ఊరట
**రైతులకు మద్దతుగా సుప్రీం తీర్పు**


**న్యూఢిల్లీ, మే 25 (మహా ప్రభ)**



భూ వివాదంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై 'స్టే' ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. భూములు కోల్పోయిన యజమానులు పెంచిన నష్ట పరిహారాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు ఆర్డర్‌పై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు ససేమిరా అంది. యాదాద్రి - వరంగల్ నేషనల్ హైవే భూసేకరణ వివాదంలో భూ యజమానులకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో హైకోర్టు ఆదేశాలు యథాతథంగా సుప్రీంకోర్టు ఉంచినట్లు అయింది. దాంతో రైతులకు భారీ ఉపశమనం కలిగినట్లు అయింది. అలాగే అధికారులు పెంచిన నష్టపరిహార మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చని రైతులకు వెల్లడించింది. నగదు విత్‌డ్రా చేసుకుంటే తర్వాత రికవరీ కష్టమన్న ఎన్‌హెచ్‌ఏఐ వాదనను ఈ కేసు విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. కేవలం ఆర్థిక భారాన్ని సాకుగా చూపి భూ బాధితులకు అందాల్సిన న్యాయమైన పరిహారాన్ని ఆపలేరని స్పష్టం చేసింది. కోర్టు విధించిన షరతులకు లోబడి పెరిగిన పరిహారం మొత్తాన్ని తెలంగాణ భూయజమానులు విత్‌డ్రా చేసుకోనున్నారు.

## నిధుల సేకరణలో సైయెంట్ సెమికండక్టర్స్

**న్యూఢిల్లీ, మే 25 (మహా ప్రభ)**



ప్రముఖ చిప్‌ల తయారీ సంస్థ సైయెంట్ సెమికండక్టర్ మరోసారి నిధులను సమీకరించింది. ఎడల్‌వైస్ నుంచి 30 మిలియన్ డాలర్లు లేదా రూ.286 కోట్ల నిధులను సేకరించినట్లు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. అంతర్జాతీయంగా చిప్‌ల వ్యాపారాన్ని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ నిధులను సేకరించినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.వీటిలో 10 మిలియన్ డాలర్లు ఈక్విటీ పెట్టుబడులు కాగా, 20 మిలియన్ డాలర్ల నిధులు డెబిట్‌గా తీసుకున్నది

## సామాన్యుల పొదుపును తగలేసేందుకు
# మోదీ సర్కారు పెట్రోల్ చల్లుతోంది

**న్యూఢిల్లీ, మే 25 (మహా ప్రభ)**



అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వరంగ చమురు సంస్థలు ఆ భారాన్ని వినియోగదారులపై మోపుతున్నాయి. ఇవాళ మరోసారి పెట్రోల్, డీజిల్ ధరల ను పెంచాయి. లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున ధరలు పెరిగాయి. అయితే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ఇదే తొలిసారి కాదు. గత రెండు వారాల్లో ఐదుసార్లు పెరిగాయి. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీ లో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12 కు, లీటర్ డీజిల్ రూ.95.25 కు చేరింది. ఇక హైదరాబాద్ లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58 గా, లీటర్ డీజిల్ ధర రూ.103.74 గా ఉందిఅయితే పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశంలో ఇంధన ధరల భారం రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. ఈ రోజువారీ దోపిడీతో ఎవరు బాగుపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యులు కూడబెట్టుకున్న పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. కేవలం రెండు వారాల్లో పెట్రోల్, డీజిల్ ధరలను ఐదుసార్లు పెంచారని మండిపడ్డారు. 2014లో లీటర్ పెట్రోల్ రూ.71.41గా ఉంటే ఇప్పుడు రూ.102.12కు చేరుకుందని గుర్తుచేశారు. రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదని ఖర్గే హెచ్చరించారు. గత పన్నెండేళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు ఐదోసారి పెరగడంతో ఇవాళ హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీ షేర్లు పెరిగినట్లు కేంద్రం చెబుతోందని అన్నారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం బీజేపీ నైజమని విమర్శించారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం బీజేపీ దోపిడీ భారాన్ని మోస్తోందని అన్నారు.

## ఫ్రాన్స్ నుంచి మరో 114
# యుద్ధ విమానాల కొనుగోలు..

**లేఖను సిద్ధం చేసిన కేంద్రం**

**న్యూఢిల్లీ, మే 25 (మహా ప్రభ)**



వైమానిక దళాన్ని మరింత శక్తిమంతంచేసే దిశగా భారత రక్షణశాఖ కీలక ముందడుగు వేసింది. ఫ్రాన్స్ నుంచి మరో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన అధికారిక ప్రతిపాదన లేఖను కేంద్రం సిద్ధం చేసింది. రాబోయే కొన్నిరోజుల్లోనే ఆ లేఖను ఫ్రాన్స్ ప్రభుత్వానికి పంపించనున్నట్లు రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ భారీ రక్షణ ఒప్పందంలో భాగంగా దాదాపు 90 యుద్ధ విమానాలను 'మేకిన్ ఇండియా' కింద ఇక్కడే తయారు చేయనున్నారు.ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్.. ఓ భారతీయ భాగస్వామ్య సంస్థతో కలిసి వీటిని మన దేశంలోనే ఉత్పత్తి చేస్తుంది. మిగిలిన విమానాలను మాత్రం నేరుగా ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకుంటారు. మన లేఖకు ఫ్రాన్స్ స్పందించిన తర్వాత అధికారికంగా టెండర్ ప్రక్రియ ముందుకు సాగుతుంది. భారతదేశ రక్షణ అవసరాలకు సరిపోయేలా రఫేల్ విమానాల్లో కనీసం 50 శాతం మేర స్వదేశీ సాంకేతికత, విడిభాగాలను ఉపయోగించాలని ఢిల్లీ గట్టిగా పట్టుబడుతోంది. ఈ రఫేల్ ఉత్పత్తి ప్రక్రియలో భారతీయ కంపెనీల పాత్రను మరింత విస్తృతం చేయాలని ఫ్రాన్స్‌ను కోరింది. భవిష్యత్తులో జరగబోయే రక్షణ సహకారాలు కేవలం కొనుగోళ్లకే పరిమితం కాకుండా ఇరు దేశాలు కలిసి డిజైన్, అభివృద్ధి చేసేలా ఒప్పందాలు ఉండనున్నాయి. భారత వైమానిక దళంలో ఇప్పటికే 36 రఫేల్ యుద్ధ విమానాలు సేవలందిస్తున్నాయి. అలాగే నౌకాదళం కోసం మరో 26 రఫేల్-ఎమ్ విమానాల కొనుగోలు ప్రక్రియ కూడా నడుస్తోంది. ఇప్పటికే మనదేశంలో రఫేల్ విమానాలకు సంబంధించిన మెయింటెనెన్స్, శిక్షణ మౌలిక వసతులు ఉండటంవల్ల మరిన్ని కొత్త విమానాలు వస్తే వాటి రవాణా, నిర్వహణ ఖర్చులు, పైలట్ల శిక్షణ వ్యయం భారీగా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ విమానాల కొనుగోలు ప్రతిపాదనకు 'డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్' ఇప్పటికే ప్రాథమిక క్లియరెన్స్ ఇచ్చింది. ఇప్పుడు పంపించబోయే లేఖకు ఫ్రాన్స్ నుంచి ధరలు, డెలివరీ సమయం, లాజిస్టిక్స్ మద్దతు వంటి వివరాలతో సమాధానం వస్తుంది. ఆ తర్వాత ఇరుదేశాల మధ్య తుది చర్చలు జరుగుతాయి. ఈ రక్షణ ఒప్పందంపై సంతకాలు చేయడానికి ముందు ప్రధాని నేతృత్వంలోని 'క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ' తుది ఆమోదం తెలపాల్సిన అవసరం ఉంది.

# కర్ణాటకలో సీఎం మార్పు..

**సిద్ధరామయ్యకు ఢిల్లీ నుంచి హైకమాండ్ పిలుపు..?**

**న్యూఢిల్లీ, మే 25 (మహా ప్రభ)**



: కర్ణాటకలో సీఎం పదవి మార్పుపై చాలా రోజులుగా ఊహాగానాలు చెలరేగుతున్నాయి. సీఎంగా ఉన్న సిద్ధరామయ్యను తొలగించి, డిప్యూటీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్‌ను సీఎం చేస్తారని చాలా రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం కీలక పరిణామం చోటు చేసుకుంది. సీఎం సిద్ధరామయ్యను ఢిల్లీ రావాల్సిందిగా కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశించింది. ఈ పరిణామాలను బట్టి కర్ణాటక సీఎంను మార్చడంతోపాటు మంత్రివర్గంలో మార్పులు జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.దీనిపై అధికారికంగా ఎలాంటి స్పష్టతా లేదు. ఈ మేరకు తనకు ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు వచ్చిందని సీఎం సిద్ధరామయ్య వెల్లడించారు. కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ అందించిన సమాచారం మేరకు ఢిల్లీ వెళ్తున్నట్లు సీఎం చెప్పారు. మంగళవారం కాంగ్రెస్ అగ్రనేతలతో సమావేశం జరగనుందని ఆయన చెప్పారు. అయితే, ఏ అంశంపై తనను ఢిల్లీకి పిలిచారో తెలియలేదన్నారు. కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో కొంతకాలంగా ముసలం నడుస్తోంది. 2023లో అక్కడ కాంగ్రెస్ విజయం సాధించింది. ఈ సమయంలో సీఎం పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య భారీ పోటీ నడిచింది. ఆ సమయంలో ఇద్దరూ తమ వర్గపు ఎమ్మెల్యేలతో హైకమాండ్ వద్ద లాబీయింగ్ చేశారు. కానీ, సీనియర్ అయిన సిద్ధరామయ్య వైపు హైకమాండ్ మొగ్గుచూపింది. అయినప్పటికీ కొంతకాలం తర్వాత సిద్ధరామయ్యను తొలగించి, డీకేను సీఎం చేస్తారని ప్రచారం మొదలైంది. కానీ, సిద్ధరామయ్య మాత్రం తానే ఐదేళ్లు సీఎంగా ఉంటానని చెప్పారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆయనకు హైకమాండ్ నుంచి పిలుపురావడం రాజకీయంగా ఆసక్తి కలిగిస్తోంది.మరోవైపు మంత్రివర్గంలో మార్పులు జరగనుందని ప్రచారం మొదలవ్వడంతో చాలా మంది ఆశావహులు తమ లాబీయింగ్ మొదలుపెట్టారు. ఎవరికి వారు తమకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని హైకమాండ్‌ను కోరుతున్నారు. ఏదేమైనా సీఎం మార్పు, మంత్రివర్గంలో మార్పుపై మరికొద్ది రోజుల్లో స్పష్టత రానుంది.

# పాక్ ప్రధాని షరీఫ్‌కు అవమానం..

**పాక్ సైన్యాధ్యక్షుడి పేరు ప్రస్తావించి ప్రధానిని మరిచిన ట్రంప్**

**న్యూఢిల్లీ, మే 25 (మహా ప్రభ)**



పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు అవమానం జరిగింది. ఈసారి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షరీఫ్‌ను అవమానించారు. ట్రంప్ ఏర్పాటు చేస్తున్న అబ్రహం అకార్డ్స్‌లో చేరాల్సిందిగా ట్రంప్ పాకిస్తాన్‌ను కోరాడు. తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్ వేదికగా ఈ విజ్ఞప్తి చేశాడు. అయితే, ఇందులో పాకిస్తాన్‌ను నడిపించే ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేరు ప్రస్తావించలేదు. పాక్ సైన్యాధ్యక్షుడు అసిమ్ మునీర్ పేరును ట్రంప్ ప్రస్తావించాడు.ట్రంప్ ఇలా పాక్ ప్రధాని పేరునే ప్రస్తావించకపోవడం అంటే ఆయనను ఘోరంగా అవమానించినట్లే అనే చర్చ జరుగుతోంది. ఎందుకంటే అంతర్జాతీయంగా దేశాధినేతల్ని ప్రస్తావించేటప్పుడు ఎవరైనా ప్రోటోకాల్ ఫాలో అవుతారు. అక్కడి రాజ్యాంగం ప్రకారం దేశంలో ఎక్కువ అధికారాలు ఉన్న వారిని ముందుగా ప్రస్తావిస్తారు. పాక్‌లో ప్రధానికే అత్యధిక అధికారాలు ఉంటాయి. సైన్యాధ్యక్షుడికి పాలనపై అంతగా పట్టు ఉండదు. ఆయన సైన్యం వరకే పరిమితం. కాకపోతే, పాక్‌లో అప్పుడప్పుడూ సైనిక పాలన నడుస్తుంటుంది కాబట్టి.. అక్కడ సైన్యాధ్యక్షుడికి విలువ ఎక్కువ. అంతమాత్రాన ఆయన ప్రధానికంటే తక్కువ కాదు. అలాంటిది ప్రధాని పేరు ప్రస్తావించకుండా, సైన్యాధిపతి పేరును ప్రస్తావించడం అంటే ట్రంప్ కావాలనే షెహబాజ్ షరీఫ్‌ను అవమానించినట్లు అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఇక్కడ ట్రంప్ పోస్ట్ ప్రకారం.. అబ్రహం అకార్డ్స్‌లో చేరేందుకు వివిధ ముస్లిం దేశాధినేతలతో మాట్లాడినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏ దేశంలో ఎవరితో మాట్లాడారో ట్రంప్ ప్రస్తావించారు. అలా పాకిస్తాన్‌లో అసిమ్ మునీర్‌తో మాట్లాడినట్లు చెప్పారు. అయినప్పటికీ ఈ అంశంపై పాక్ ప్రధానిని పక్కనబెట్టి సైన్యాధ్యక్షుడితో ట్రంప్ చర్చించడం మరో వివాదానికి దారి తీసింది. ఇజ్రాయెల్‌ను, ఇతర ముస్లిం దేశాలను కలిపి ట్రంప్.. అబ్రహం అకార్డ్స్ ఏర్పాటు చేశారు. దీనిపై 2020లో ఒక ఒప్పందం కుదిరింది. దీన్ని బలోపేతం చేసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇతర ముస్లిం దేశాలు ఈ సమూహంలో చేరాలని ట్రంప్ కోరుతున్నారు. అయితే, ఏ ముస్లిం దేశం ఎలా స్పందిస్తుందో చూడాలి.

## బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ నిషేధం

మొదటి తరువాయి

సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం యోగి పలు సూచనలు చేశారు. ప్రార్థనలు కేవలం మసీదులు, ఈద్గాహ్‌ల పరిధిలోనే జరగాలని.. రోడ్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అనుమతి ఉండదని తెలిపారు. ఒకవేళ అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే పరిస్థితి ఉంటే షిఫ్టుల్లో నమాజ్ నిర్వహించాలని సూచించారు. అలాగే.. జంతుబలి విషయంలోనూ కఠిన నిబంధనలు అమలు చేయాలని యోగి ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో కుర్బానీ పూర్తిగా నిషేధమని, ప్రభుత్వం నిషేధించిన జంతువులను బలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. కుర్బానీ అనంతరం కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, సరైన పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖను అప్రమత్తం చేశారు సీఎం యోగి. రాష్ట్రంలోని సున్నిత ప్రాంతాలు, ఈద్గాహ్‌లు, మసీదుల వద్ద అదనపు భద్రతా బలగాలను మోహరించాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేయాలని సూచించారు. అల్లర్లకు ప్రేరేపించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. అల్లర్లు సృష్టించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈద్గాహ్‌ల వద్ద పోలీస్ బలగాలను మోహరించాలని, సున్నితమైన ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా చేపట్టాలన్నారు.

## తెలంగాణలో రోహిణీ కార్తె ఎఫెక్ట్..

మొదటి తరువాయి

45 డిగ్రీల నుండి ఏకంగా 46.5 డిగ్రీల సెల్సియస్కు చేరడంతో జనం ఇళ్ల నుండి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే మొదలవుతున్న ఎండ తీవ్రత, మధ్యాహ్నానికి నిప్పుల కొలిమిని తలపిస్తోంది. రాష్ట్రంలోనే అత్యధికంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా 46.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. దీనితో పాటు సూర్యాపేట, మంచిర్యాల జిల్లాల్లో 46.4 డిగ్రీలు, నల్గొండ, ఖమ్మం, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 46.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. పెద్దపల్లి, హనుమకొండ జిల్లాల్లో 46.2 డిగ్రీలు, జగిత్యాలలో 46.1 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, మహబూబాబాద్ జిల్లాల్లో 45.9 డిగ్రీలుగా ఎండ తీవ్రత నమోదైంది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, జనగామ, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటేసి రెడ్ అలర్ట్ పరిధిలోకి వచ్చేశాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ విషయానికి వస్తే.. నగరంలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, చుట్టుపక్కల ఉండే మేడ్చల్-మల్కాజ్ గిరిలో 42.4, రంగారెడ్డిలో 43.1, సంగారెడ్డిలో 42.1 డిగ్రీల చొప్పున ఎండలు ఉన్నాయి. నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మాత్రమే స్వల్ప ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే తక్కువగా నమోదై కాస్త ఉపశమనం కలిగించాయి. అయితే, రాబోయే మూడు రోజుల వాతావరణ ముందస్తు సూచనలు కూడా ఏమాత్రం ఆశాజనకంగా లేవు. రానున్న రోజుల్లో ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం లాంటి జిల్లాల్లో ఎండలు మరింత ముదిరి 45.7 డిగ్రీల వరకు వెళ్లే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు తగ్గించుకోవాలని వాతావరణ శాఖ సూచించింది.

## పెట్రో మంట

మొదటి తరువాయి

దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. అయితే ఇది పది రోజుల వ్యవధిలో జరిగిన నాలుగో ధరల పెంపు కావడం గమనార్హం. దేశంలో వరుసగా పెరుగుతున్న ఇంధన ధరలతో ఇప్పటికే సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, తాజా పెంపు మరింత భారాన్ని మోపనుంది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు దాదాపు రూ.8 వరకు పెరిగాయి.

వివిధ నగరాల్లో పెరిగిన ధరలు ఇలా

తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12కు చేరుకోగా, డీజిల్ ధర రూ.95.20కు పెరిగింది. ముంబయిలో లీటర్ పెట్రోల్ ధర రూ.111.18కి, డీజీల్ ధర రూ.97.83కి చేరింది. బెంగళూరులో లీటర్ పెట్రోల్ ధర రూ.110.93కి, డీజీల్ ధర రూ.98.80కి పెరిగింది. చెన్నైలో లీటర్ పెట్రోల్ ధర రూ.107.77కు, డీజీల్ ధర రూ.99.55కు ఎగబాకింది. కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ ధర రూ.113.47కి, డీజీల్ ధర రూ.99.82కి చేరింది. ఇక తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్‌పై రూ.2.88 పెరిగి.. ధర రూ.115.73కి చేరుకుంది. లీటర్ డీజిల్‌పై కూడా రూ.2.88 పెరిగి.. ధర రూ.103.82కు ఎగబాకింది. మరోవైపు ఏపీలోని విజయవా డలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.75కి, లీటర్ డీజిల్ ధర రూ.105.43కు చేరింది.

## పదవుల కోసం వారు అక్కర్లేదు


మొదటి తరువాయి

బదులిస్తామని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఇకపోతే కుల రాజకీయాలు, ప్రత్యర్థి పార్టీల విమర్శలు, పార్టీ అంతర్గత పరిస్థితులపై జనసేన పార్టీ సమావేశంలో ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో రాజకీయాలు చాలా సాఫీగా సాగిపోయాయని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అక్కడి రాజకీయాలను చూస్తే అసూయ కలిగేంత సులభంగా జరిగాయని అన్నారు. తాను పదేపదే కులం గురించి మాట్లాడుతున్నానని కొందరు విమర్శిస్తున్నారని పేర్కొన్న పవన్.. తాను ఎప్పుడైనా కుల నాయకుడినని చెప్పానా? మిగతా పార్టీ నేతలు కులం గురించి మాట్లాడటం లేదా? అంటూ ప్రశ్నించారు. కులాలను రెచ్చగొట్టే మనస్తత్వం సమాజానికి మంచిది కాదని సూచించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగిన చర్చలపై కూడా ఆయన స్పందించారు. 'నేను అమిత్ షాతో మాట్లాడిన విషయాలు బయటవాళ్లకు ఎలా తెలుస్తాయి? ఏపీ బీజేపీ నేతలు ఎందుకు స్పందించలేదు? వైసీపీ నేత జైలుకెళ్లాలని నేను ఎందుకు కోరుకుంటాను? ఒక నాయకుడు జైలుకెళ్తే జనసేన ఎదుగుతుందా?' అంటూ వ్యాఖ్యానించారు. కేంద్ర హోంమంత్రితో రాష్ట్ర అభివృద్ధి అంశాలపైనే మాట్లాడతాం.. ఇలాంటి ఆరోపణలు చేయడం వ్యవస్థను అవమానపరచడమేనని పవన్ అన్నారు. తాను అమిత్ షాను కలిసింది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసమేనని స్పష్టం చేశారు. 'నేను అన్నింటికీ తెగించే రాజకీయాల్లోకి వచ్చాను. శత్రువు బలంగా ఉన్నప్పుడే ఎదుర్కొంటా.. బలహీనులను కాదు' అని వ్యాఖ్యానించారు. 'మాకు కూడా కోపాలు, బాధలు ఉంటాయి. చూస్తూ ఊరుకుంటామని అనుకోవద్దు. దేనికైనా ఒక హద్దు ఉంటుంది.. భరిస్తాం.. సహిస్తాం.. అవసరమైతే తాట తీస్తాం' అంటూ పవన్ హెచ్చరించారు.

## ఒక్క రక్తపు చుక్కతో క్యాన్సర్ నిర్ధారణ..

**-సరికొత్త పరికరాన్ని అభివృద్ధి చేసిన చైనా పరిశోధకులు**

**-10 వేల రెట్లు ఎక్కువ కచ్చితత్వం**



**న్యూఢిల్లీ,**

క్యాన్సర్ నిర్ధారణలో వైద్యులు ప్రస్తుతం ఉపయోగిస్తున్న వైద్య పరికరాల పరిమాణం చాలా పెద్దది. చైనా సైంటిస్టులు.. దీనిని చేతిలో పట్టే ఒక పరికరంగా కుదించగలిగారు. 'నానోఫొటోనిక్ బయోసెన్సింగ్' అనే పరికరాన్ని చైనాలోని (హాంగ్‌జౌ) 'వెస్ట్‌లేక్ వర్సిటీ' సైంటిస్టులు తయారుచేశారు. దీనిపై 'నేచర్ ఫొటోనిక్స్' జర్నల్ కథనం ప్రకారం, ఒకే ఒక్క రక్తపు చుక్కను తీసుకొని.. 'నానోఫొటోనిక్ బయోసెన్సింగ్' పరికరం అత్యంత కచ్చితమైన ఫలితాన్ని ఇస్తుంది. సంప్రదాయ పద్ధతుల్లో ఉండే కచ్చితత్వంతో పోల్చితే..దీంట్లో 10,000 రెట్లు ఎక్కువ కచ్చితత్వంతో క్యాన్సర్‌ను గుర్తించొచ్చు. మన శరీరంలో క్యాన్సర్ ఉందా? లేదా? అన్నది చెప్పేది రక్తమే. దీంట్లో వచ్చిన మార్పులను గుర్తించడానికి కాంతి కిరణాలను ఉపయోగిస్తారు. దీనిని విశ్లేషించడానికి చైనా శాస్త్రవేత్తలు ప్రత్యేకమైన 'త్రీడీ చిప్'ను ఉపయోగించారు. రక్తంలోని సూక్ష్మమైన మార్పును గుర్తించటంలో 'నానోఫొటోనిక్ బయోసెన్సింగ్' పరికరానికి ఈ త్రీడీ చిప్ దోహదపడుతుంది.

# కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

మొదటి తరువాయి

సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బాజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# మోదీ..గ్రేట్

**-భారత్ అతి శక్తివంతమైన దేశమన్న ట్రంప్**

**-మోదీ నాయకత్వంలో వేగంగా అభివృద్ధి**

**-మోదీకి ఏ సాయం కావాల్సినా చేస్తాం**

**-నేరుగా నాకే ఫోన్ చేయవచ్చు**

**-భారత్ అమెరికాకు నమ్మకమైన మిత్రుడంటూ కామెంట్**

**-ప్రధానిని ప్రశంసలతో ముంచెత్తిన పెద్దన్న**



**న్యూఢిల్లీ,**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రశంసలు కురిపించారు. భారత్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. మోదీ చాలా గ్రేట్.. ఆయనకు తాను పెద్ద అభిమానిని.. అంటూ ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశం ఏది కావాలనుకుంటే.. దానిని సాధించి తీరుతుంది.. అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

ఢిల్లీలో అమెరికా స్వాతంత్ర్య వేడుకలు

అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలు ఢిల్లీలో కలర్‌ఫుల్‌గా జరిగాయి. ఈ నేపథ్యంలో భారత్ పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ శాఖ మంత్రి రూబియో ఆధ్వర్యంలో ఆదేశ ఎంబసీ ఢిల్లీలో ఓ కార్యక్రమం నిర్వహించింది. ఈ క్రమంలో భారతలోని యూఎస్ రాయబారి సెరియా గోర్, అలాగే రూబియోతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ లైవ్ ఫోన్‌కాల్‌లో మాట్లాడారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ రికార్డులు సృష్టిస్తోందన్నారు. ఇక, రూబియో... అమెరికా చరిత్రలోనే గొప్ప విదేశాంగ కార్యదర్శిగా నిలుస్తారని ట్రంప్ అన్నారు. ఇక, భారత్ అంటే తనకు ఎంతో ఇష్టమని.. ప్రధాని మోదీ గొప్ప నాయకుడు.. తనకు మంచి స్నేహితుడు అంటూ చెప్పుకొచ్చారు. అంతేకాదు, నరేంద్రమోదీకి తాను పెద్ద అభిమానిని అన్నారు. భారత్‌కు ఎప్పుడైనా సహాయం అవసరమైతే.. తనను వందశాతం నమ్మవచ్చునన్నారు. భారత్‌కు ఏ అవసరం వచ్చినా.. నేరుగా తనకు కాల్ చేయవచ్చునన్నారు. ప్రధాని మోదీకి తన తరపున శుభాకాంక్షలు చెప్పాలని.. ఆయనకు తాను పెద్ద ఫ్యాన్‌ని అంటూ ఫోన్‌కాల్ ముగించారు.

త్వరలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం

ఇదిలాఉంటే.. అమెరికా, భారత్‌లు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు దగ్గరలోనే ఉన్నాయని.. ఇది త్వరలోనే జరుగుతుందని మార్కో రూబియో ఆదివారం వెల్లడించారు. ఈ ఒప్పందంతో ఇరుదేశాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అంతకుముందు రూబియో.. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి జైశంకర్‌తో భేటీ అయ్యారు.

# బీజేపీవి రాజకీయ డ్రామాలు

**-ఒక వైపు పెట్రోల్, డీజిల్ ధరలతో ప్రజల నడ్డి విరుస్తోంది**

**-మరో వైపు రైతులకు భరోసా అంటూ బస్సు యాత్ర**

**-రైతు వ్యతిరేక విధానాలతో ప్రజలకు మోసం**

**-రైతు పండించే ప్రతి గింజ కేంద్రం కొనాలి**

**-మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్**



**తెలంగాణ బ్యూరో ప్రతినిధి :**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్య ప్రజల నడ్డి విరుస్తూ, ప్రజల అసలు సమస్యల నుండి దృష్టి మళ్లించేందుకు రైతు గోస -- బీజేపీ భరోసా పేరుతో బస్సు యాత్రలు చేపట్టడం పూర్తిగా రాజకీయ డ్రామా అని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెల్చి చెప్పారు. సోమవారం మంత్రి పొన్నం ఓ ప్రకటన విడుదల చేస్తూ... రోజురోజుకు పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావంతో రైతులపై సాగు వ్యయం భారీగా పెరిగిందన్నారు.. ట్రాక్టర్లు, మోటార్లు, రవాణా ఖర్చులు అన్నీ పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కానీ రైతు సంక్షేమం గురించి మాట్లాడుతున్న బీజేపీ నిజంగా తెలంగాణ రైతులపై ప్రేమ ఉంటే పెట్రోల్ ధరలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పైవ త్రిడి తేవాలన్నారు రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడంలో కేంద్రం విఫలమైంది. కొనుగోలు చేసిన ధాన్యంలో బాయిల్డ్ రైస్ సాంక్షన్ చేయడంలో, లేవీ రైస్ కు అనుమతులు ఇవ్వడంలో సహకరించడం లేదని మండి పడ్డారు. ఇప్పటికి కేవలం 53.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మాత్రమే అనుమతి ఇచ్చింది. కానీ తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలగకుండా 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉన్న 8 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేగంగా యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేస్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 21 కోట్ల గోనె సంచులను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచాం. ఇప్పటివరకు తెలంగాణ ప్రభుత్వం 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.8,749 కోట్ల కనీస మద్దతు ధర చెల్లించిందన్నారు పొన్నం. వ్యవసాయ చట్టాల పేరుతో దేశవ్యాప్తంగా రైతులను ఇబ్బందులకు గురిచేసి, 700 మందికి పైగా రైతుల ప్రాణాలు పోయే పరిస్థితి తీసుకొచ్చిన బీజేపీ ఇప్పుడు రైతులకు భరోసా ఇస్తామని చెప్పడం నమ్మశక్యం కాదని. బడా పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తూ రైతులకు మాత్రం నయా పైస రుణమాఫీ చేయకపోవడం రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనం. అనిగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతులపై లాఠీచార్జీలు చేయించిన ఘటనలు దేశం చూసింది. రైతుల బాధలను పట్టించుకోని బీజేపీ నేతలు ఇప్పుడు రైతు ప్రేమ గురించి మాట్లాడటం కపట నాటకం అన్నారు. తెలంగాణలో పండిన మొత్తం ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

## మహిళా సాధికారతకు 'ప్రజా ప్రభుత్వం' పెద్దపీట

మొదటి తరువాయి



చారిత్రాత్మక నిర్ణయాలను వివరించారు. గతంలో మహిళా సంఘాలకు సొంత కార్యాలయాలు లేకపోవడం వల్ల గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు పడేవారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. పంచాయతీ కార్యాలయాల్లోనో, సభ్యుల ఇండ్లల్లోనో, చివరకు స్థలం లేక చెట్ల కింద కూర్చోని సమావేశాలు నిర్వహించుకునే దుస్థితి ఉండేదన్నారు. ఈ పరిస్థితిని మారుస్తూ, మహిళలకు గౌరవప్రదమైన రీతిలో శాశ్వత భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ 8 వేల కార్యాలయాల నిర్మాణం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినప్పుడు.. గత పదేళ్లుగా మహిళా సంఘాలను గాలికి వదిలేసిన బీఆర్ఎస్ నాయకులు హేళన చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. ఏడాదికి రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల రుణాలు ఇప్పిస్తామని చెప్తే విపక్షాలు నవ్వారన్నారు. "మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మా నిబద్ధతతో నిరూపించాం. కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలోనే ఏకంగా రూ. 60,000 కోట్ల రూపాయలను బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళలకు అందించి చారిత్రాత్మక రికార్డు సృష్టించాం. రాబోయే రెండున్నర ఏళ్లలో ఈ మొత్తం రూ.లక్ష కోట్లే కాదు.. రూ. 1,25,000 కోట్లకు పైబడేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. మా సాధించిన ఈ విజయమే నాడు విమర్శించిన వారికి చెంపపెట్టు" అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మహిళా సంఘాలకు మరింత ఆర్థిక ఊతం ఇచ్చేందుకు వడ్డీ లేని రుణాల పరిమితిని పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఆయన తెలిపారు. గతంలో ఉన్న రూ.5 లక్షల పరిమితిని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కల చొరవతో రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం పట్ల రాష్ట్రవ్యాప్తంగా మహిళల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. 'కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం' అనే లక్ష్యం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా.. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకానికి సంబంధించి నిర్దిష్టమైన టార్గెట్లు (లక్ష్యాలు) నిర్దేశించి, ఒక స్పష్టమైన టైమ్ క్యాలెండర్ ను రూపొందించాలని సీఎం ఆదేశించారన్నారు. ఇది ప్రభుత్వం యొక్క సంకల్ప బలానికి, చిత్తశుద్ధికి నిదర్శనమని భట్టి విక్రమార్క కొనియాడారు. మహిళా సంఘాల సభ్యులందరూ ఈ ప్రోత్సాహాన్ని ఉపయోగించుకుని ఆర్థికంగా మరింత పైపైకి ఎదగాలని, దేశానికే దిక్సూచిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

## బిఆర్ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

మొదటి తరువాయి

నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, భవనాలను ఓపెన్ చేస్తూ తామే చేశామని అబద్దాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో కేవలం అభివృద్ధిపైన మాత్రమే దృష్టి సారించామని.. ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీకి అండగా ఉన్న కార్యకర్త, నాయకుడికి తగిన అవకాశం, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నమోదు చేసిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ ఒక్కరి ఓటు కోల్పోకుండా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలని నేతలకు కేటీఆర్ దిశానిర్దేశర చేశారు. కేసీఆర్ ఒక్క రూపాయికే నల్లా కనెక్షన్ ఇచ్చి ఇంటింటికీ మంచినీటి గోస తీర్చారని కేటీఆర్ తెలిపారు. ఏడాదిన్నరలోనే కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని పేర్కొన్నారు. 2028లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో 24 గంటలు మంచినీళ్లు ఇస్తామని తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలకు కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. 24 గంటలు మంచినీళ్లు ఇచ్చేది కూడా కేసీఆరే అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం దివాళా తీసిందని కేటీఆర్ తెలిపారు. ఇందిరాపార్క్ దగ్గర సెంట్రింగ్ కార్మికులు ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. సెంట్రింగ్ వర్కర్లు, నిర్మాణ రంగ కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మళ్లీ రాబోయేది కేసీఆర్.. గులాబీ జెండానే అని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మిమ్మల్ని ఆదుకుంటామని అన్నారు. సెంట్రింగ్ కార్మికులకు బీమాతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తాం.. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కూకట్‌పల్లిలోని 15 డివిజన్లలో కొత్త అధ్యక్షులను నియమిస్తామని కేటీఆర్ తెలిపారు. జూన్‌లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో కార్పొరేటర్లు నిబద్ధత కలిసిన సైనికుల్లా పనిచేశారని అన్నారు. ఎవరైతే ప్రజల చుట్టూ తిరుగుతారో.. వాళ్లకే కార్పొరేట్ టికెట్లు ఇస్తామని పునరుద్ఘాటించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని బీఆర్ఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. సర్వేల ఆధారంగా కార్పొరేటర్లకు టికెట్లు కేటాయిస్తామని చెప్పారు. డిజిటల్ పద్ధతిలో పార్టీ సభ్యత్వ నమోదు చేపడుతున్నామని తెలిపారు. సభ్యత్వ నమోదు తర్వాత కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్‌పై అవగాహన కల్పిస్తామని చెప్పారు. తెలంగాణలో 3.39 కోట్ల ఓటర్లు ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో 35,985 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. మన పార్టీ తరఫున బూత్ లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ప్రతి ఓటు విలువైనదే.. నా పోలింగ్ బూత్ నా బాధ్యత అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదలు సుఖంగా జీవించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. తమ హయాంలో ఏ ఒక్కరినీ ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. పేదలు తెలియక ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకుంటే జీవో 58, 59 కింద పట్టాలు ఇచ్చామని అన్నారు. రెండున్నర లక్షల మంది పేదలకు పట్టాలు ఇచ్చిన మహానాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. హైదరాబాద్ నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు చూపిస్తే నేను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాలు విసిరారు.

# సంపాదకీయం

## కాంగ్రెస్, ఆప్ ఎజెండాతో కాక్రోచ్ పార్టీ




భారత రాజకీయాల్లో యువత ప్రవేశించాలి. నేతల అక్రమాలను ప్రశ్నించాలి. అక్రమాలను నిలదీయాలి. అక్రమార్కులను ఎండగట్టాలి. పాచిపోయిన విధానాలను తూర్పరా పట్టాలి. ఈ దేశానికి ఏది అవసరమో దానిని ఎజెండగా ముందుకు తీసుకుని రావాలి. కానీ యువత ఎందుకనో అచేతనంగా ఉంటోంది. ఓటు వేయడానికే బద్ధకిస్తోంది. జెన్ జి అంటూ వార్తలు వస్తున్నా..గట్టిగా నిలబడి రాజకీయ అవినీతిని నిలదీయడం లేదు. రాజకీయ అక్రమాలను నిలదీయడం లేదు. కానీ కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ఆన్‌లైన్ వేదికగా పుట్టుకు వచ్చిన ఓ పార్టీకి కోట్లల్లో లైక్‌లు కొడుతూ..వస్తున్నారు. నిజంగానే ఈ పార్టీ పెట్టిన వారు..దీని లక్ష్యం గురించి ఆలోచిస్తే..అసలు విషయం బయటపడుతుంది. పక్కాగా కాంగ్రెస్, ఆప్ పార్టీల ఎజెండాతో ఇది అవతరించింది. ఇందులో ప్రధాన ఎజెండాలో ఉన్న ఐదు హామీలు కాంగ్రెస్, ఆప్‌లవే అని చెప్పాలి. ఈ రెండు పార్టీల సూత్రధారులుగా అభిజిత్ అన్న వ్యక్తి అమెరికా నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రకటించిన ఈ పార్టీ కేవలం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత యువతను బొద్దింకలతో, పరాన్నజీవులతో పోల్చడం వల్లే జెన్‌జీ గొంతెత్తిందని ప్రచారం చేస్తున్నారు. అయితే ఇక్కడ జస్టిస్ సూర్యకాంత ఏ సమయంలో ఎవరిని ఉద్దేశించి, ఎందుకు బొద్దింకులు, పరాన్న జీవులు అన్నాడో తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా బొద్దింకల పార్టీ అంటూ ప్రకటించడం, దానికి గొర్రెల్లాగా మద్దతు తెలపడం దారుణం. ఇది ఓ రకంగా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో లాయర్లుగా, ఆర్టిఐ కార్యకర్తల్లాగా సమాజం మీద పడి పోతున్నారన్న సందర్భంగా జస్టిస్ట్ సూర్యకాంత బొద్దింకలు పదాన్ని వాడారు. నిజంగానే జెన్‌జీ పోరాటం చేయాల్సిన సామాజిక రుగ్మతలు ఉన్నాయి. పాలకుల దుష్ట పన్నాగాలను దునుమాడాలి. మన విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నందుకు గొంతెత్తాలి. మన వైద్యారోగ్య రంగాన్ని ప్రైవేటుకు తాకట్టు పెట్టినందుకు నిలదీయాలి. స్వాతంత్రోద్యమ కాలంలోనూ, ఆ తరవాత కూడా యువత దేశంలో కీలక భూమిక పోషించింది. అసోంలో విదేశీ చొరబాట్లకు వ్యతిరేకంగా అస్సాగణపరిషత్ చేసిన పోరాటం అనన్యసామాన్యం. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణ తొలిదశ, మలిదశలోనూ యువతే కీలక భూమిక పోషించింది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి కేవలం కాంగ్రెస్, ఆప్ గేమ్ ప్లాన్‌లో యువత పడిపోవడం దౌర్భాగ్యం. నిజానికి చట్టసభల్లో అటు పార్లమెంటులోనూ,ఇటు అసెంబ్లీల్లోనూ కొన్ని కుటుంబాలే ఏళ్లుగా పట్టుకుని వేళ్లాడుతున్నాయి. ఆప్ చరిత్ర ఎవరికీ తెలియనిది కాదు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని హైజాక్ చేసుకుని వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారు. ప్రజల్లో కల్పించిన ఆశలను వమ్ముచేశారు. అన్నా హజరానేనే మోసం చేసి మనముందు ఇప్పుడు నిలబడ్డాడు. ఇకపోతే గబ్బిలాల్లాగా చట్టసభల్లో తరతరాలుగా కొందరే పట్టుకుని వేలాడుతున్నారు. ఒకే కుటుంబం నుంచి కొందరే పార్లమెంట్ లేదా, అసెంబ్లీల్లో ఉంటున్నారు. పార్లమెంటులో సోనియా, రాహుల్, ప్రియాంక ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి వీరు ముగ్గురూ ఎందుకు ఉండాలి. అమిత్ షా కొడుకు ఏం అర్హత ఉందని బిసిసి అధ్యక్షుడయ్యారు. ఇలాంటివి ప్రశ్నించాలి. చంద్రబాబు కుటుంబంలో చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ, శ్రీభరత్, పురందేశ్వరిలు మాత్రమే ఎందుకు ఉండాలి. తెలంగాణలో వెంకటస్వామి ఇద్దరు కొడుకులు వివేక్, వినోద్‌లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వివేక కొడుకు వంశీ ఎంపిగా ఉన్నారు. వీరంతా ఎస్సీ రిజర్వ్ కేటగిరీలో ఎంపికయ్యారు. మల్లు భట్టివిక్రమార్క బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మవతిలు కూడా ఒకే ఇంటినుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వీరే నాయకులా..ఇక వేరే వారు లేరా. తెలంగాణ ఉద్యమంలో యువత బలిదానాలు చేస్తే...కెసిఆర్, ఆయన కొడుకు, కూతురు, అల్లుడు, ఇంకా కొందరు బంధువులు తెలంగాణను భ్రష్టు పట్టించి దోచుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లుగా ఉన్నాయి. జెన్‌జీ అని చెప్పుకుంటున్న యువత వీటిని నిలదీయాలి. కొందరే ఎల్లకాలం ప్రజాప్రతినిధులుగా ఎందుకు ఉండాలో అడగాలి. ప్రస్తుత డిజిటల్ యుగంలో రాజకీయాలను విశ్లేషించే విధానం పూర్తిగా మారిపోయింది. గతంలో తీవ్రమైన చర్చలు, వీధిపోరాటాల ద్వారా సాగిన రాజకీయ నిరసన నేడు సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్నది. మీమ్స్, పొలిటికల్ సెటైర్ల రూపంలో సాగుతున్నది. ఈ క్రమంలో జెన్-జీ యువత సృష్టించిన సరికొత్త వ్యంగ్యాస్త్రమే 'కాక్రోచ్ జనతా పార్టీ'. ఇది నిజమైన రాజకీయ పార్టీ కాకపోయినా ప్రస్తుత రాజకీయ వ్యవస్థలోని లోపాలను, నాయకుల అవకాశవాదాన్ని ఎండగట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. అయితే ముందే చెప్పినట్లు దీని ఎజెండా కేవలం కాంగ్రెస్, ఆప్ ఎజెండగా నిలవడమే పెద్ద లోపభూయిష్టంగా ఉంది. అసలు సమస్యలు వదిలి రిటైర్డ్ జడ్జిలని ఎంపిలుగా తీసుకో, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను నిలదీస్తాం వంటివన్నీ కాంగ్రెస్ ఎజెండా. సుమారు 145 కోట్ల ఈ దేశ జనాభాలో 65శాతానికి పైగా జనాభా 35ఏండ్ల లోపు ఉన్నవారే. అంటే ప్రపంచంలోనే అత్యధిక యువతను కలిగిన దేశమిది. ఈ దేశ భవిష్యత్తును నిర్ణయించాల్సింది వీరే. వీరే ముందుండి నడపాల్సిన అసవరం ఉంది. అపారమైన శక్తి కలిగిన ఈ దేశ యువతను తప్పుదోవ పట్టించేలా అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమాల వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటుకు ముందుకు రావడం, యువతను ఆకట్టుకోవడం చేశాడు. అంతవరకు మంచిదే అయినా, ఆయన గతమంతా ఆప్‌లో పనిచేసిన అనుభవాన్ని మరువ రాదు. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌లకంటే కూడా 1.6 కోట్ల ఫాలోవర్స్‌తో దేశంలోనే అతిపెద్ద ఫాలోయింగ్ ఉన్నట్లుగా తేలింది. దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ సిద్ధాంతం గెలిచినా.. కొందరు నాయకులు మాత్రం తమ పదవులను, ఉనికిని కాపాడుకోవటానికి రాత్రికి రాత్రే అధికార పార్టీలోకి మారిపోతుంటారు. సిద్ధాంతాలు, విలువలతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ అధికారంలో కొనసాగే అవకాశవాద, ఫిరాయింపు నాయకులను ఈ బొద్దింకల పార్టీ నిలదీయగలిగితే మంచిదే. మన దేశ యువతరం ఆలోచనలు ఎంత ఉన్నతంగా ఆలోచనాత్మకంగా ఉన్నాయనేదానికి వారి కార్యాచరణ ముఖ్యం. సమాజంలో పెరుగు తున్న అవినీతిని, రాజకీయ అస్థిరతను సంస్కరించేందుకు యువత నడుం బిగించాలి. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించటానికి, విమర్శించటానికి ఆరోగ్యకర మైన వేదిక అవసరం ఉంది. దేశంలో నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్న పాలకులను ఎంతమాత్రం క్షమించ రాదు. వారు ఏ పార్టీ వారైనా నిలదీయల్సిందే. ప్రజల ముందు దోషులగా నిలబెట్టాల్సిందే. నీట్ పరీక్షా పత్రం లీకేజీపై కూడా నిలదీయాల్సిందే. నేర చరిత్రలేని నాయకులు చట్టసభల్లో ఉండాలి. దేశం కోసం పాటుపడేవారంతా ప్రశ్నించటం నేర్చుకున్నప్పుడే భారత ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రశ్నించడం మంచిదే అయితే, అనేక అంశాలను ప్రశ్నించడం ఎజెండాగా చేసుకుంటే మంచిది. అంతే తప్ప మరో రాజకీయ పార్టీ సృష్టించిన వేదిక ద్వారా చేయడం మాత్రం సరికాదు.

## దంతపల్లి గ్రామానికి మై నం పల్లి సోషల్ సర్వీస్ ద్వారా బోర్ మోటార్ అందజేత



**రామాయంపేట మే 25 మహాప్రభ**
మైనాంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సొంత నిధులతో రామాయంపేట మండలంలోని దంతపల్లి గ్రామానికి నూతనంగా నిర్మిస్తున్న ముదిరాజ్ గంగమ్మ టెంపుల్ కు. కొత్త బోర్వెల్ తోపాటు పంపు మోటార్ సెట్ ను అందజేశారు. కార్యక్రమాన్ని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు గారు వారికి అందజేశారు

## మహిళా సంఘ భవనం నిర్మాణానికి భూమి పూజ

-ఎమ్మెల్యే మదన్ మోహన్ సహకారంతో
-సర్పంచ్ మమ్మాయి రేణుక సంజీవ్ యాదవ్



**గాంధారి మే 25 (మహా ప్రభ)**
కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ సహకారంతో గాంధారి మండల కేంద్రంలో మహిళా సంఘ భవనాలు నిర్మాణ భూమి పూజ, శంకుస్థాపన ప్రారంభించినట్లు మమ్మాయి రేణుక సంజువ్ యాదవ్, మాట్లాడుతూ... మహిళాలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న, మహిళా సంఘుల కోరిక మేరకు ఎమ్మెల్యే మదన్ మోహన్ సహకారంతో భవన నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన చేశారు. గ్రామ మహిళా సంఘాలు మహిళలు, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" మహిళా వారోత్సవాలను నిర్వహిస్తోంది. దీని ముఖ్య ఉద్దేశ్యం మహిళా సంస్థల బలోపేతం, జీవనోపాధి అవకాశాల పెంపు, సామాజిక సమీకరణ మరియు మౌలిక వసతుల అభివృద్ధి. జిల్లా కలెక్టర్లకు ప్రధాన సూచనలు: జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి. బ్యాంకులు, వ్యవసాయ, పశు సంవర్ధక, విద్యుత్ తదితర శాఖలతో సమన్వయం చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్ లు, సొసైటీ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్స్, ఐకెపి అధికారులు, మహిళా మండలి అధ్యక్షులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విజయ డైరీ ఉత్పత్తులు ప్రజలకు మరింత చేరువలో గుత్తాఅమిత్ రెడ్డి




**దేవరకొండ మే 25 ( మహాప్రభ )**
సోమవారం హైదరాబాద్,నాచారం మరియు లాలాపేట ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఏ సి ఎస్ సి ఈ ఆధ్వర్యంలో ప్రజలకు ప్రభుత్వ సేవలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరి ఉత్పత్తులను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన తెలంగాణ విజయ డైరీ తెలంగాణ పార్లర్ ను ఎండి చంద్రశేఖర్ రెడ్డి ఐఏఎస్ సిఎస్ సిఉపాధ్యక్షులు డా. విఘ్నేష్ స్వర్ణ మోహన్ మరియు ఇతర అధికారులతో కలిసి ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర డైరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు

## విద్యుత్ షాక్ తో గృహిణి మృతి



**పాపన్నపేట మే25( మహాప్రభ )**
విద్యుత్ షాక్ కు గురై ఓ వివహిత మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ముద్దపూర్ గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటింబికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దపూర్ గ్రామానికి చెందిన పోలీసు పార్వతి (35) సోమవారం ఉదయం కూతురు స్యారీ పంక్షన్ ఉండడంతో అల్మరలో ఉన్న బట్టలు తీసుకునేందుకు వెళ్లగా ఆల్మరా పై ఉన్న విద్యుత్ తీగలను ఎలుకలు కొట్టడంతో విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్ గురై అయి అరవడం తో కుటింబికులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపి వేసి మెదక్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలుపడంతో వెంటనే కుటింబికులు పాపన్న పేట పోలుసులకు సమాచారం అందివ్వడంతో పాపన్న పేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా నిర్వహించి మృతురాలి భర్త రవి పిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## అత్యవసర నగదు పేరుతో కొత్త తరహా మోసాలు.

-క్యాటరింగ్, ఫోటోగ్రఫీ వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి.
-బుకింగ్ పేరుతో డబ్బులు కాజేస్తున్న సైబర్ నేరస్థులు.
-తెలియని వ్యక్తులకు నగదు పంపొద్దు.
-మెదక్ జిల్లా ఎస్పీ, డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్.



**మెదక్ జిల్లా -25మే (మహాప్రభ )**
ఫంక్షన్ హాల్ యజమానులు, క్యాటరింగ్, ఫోటోగ్రఫీ, డెకరేషన్ వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరస్థులు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ హెచ్చరించారు. మోసగాళ్లు ముందుగా ఫంక్షన్ హాల్ బుకింగ్ పేరుతో ఫోన్ చేసి తేదీలు, రేట్లు ఖరారు చేసుకుంటున్నారని తెలిపారు. అనంతరం "షాపింగ్‌లో ఉన్నాం.. అత్యవసరంగా నగదు అవసరం వచ్చింది.. మీరు ఇప్పుడు డబ్బులు పంపిస్తే సాయంత్రానికి వచ్చి నగదు చెల్లిస్తాం" అంటూ ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యూపీఐ యాప్‌ల ద్వారా డబ్బులు పంపించుకొని మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.అంతేకాకుండా, "మీకు పరిచయం ఉన్న క్యాటరింగ్, ఫోటోగ్రఫీ, డెకరేషన్ వ్యాపారుల నంబర్లు ఇవ్వండి" అంటూ వారి వివరాలు సేకరించి, అదే విధంగా ఇతర వ్యాపారులను కూడా మోసం చేస్తున్నారని ఎస్పీ తెలిపారు.

**వ్యాపారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**
తెలియని వ్యక్తులకు ఫోన్ ఆధారంగా డబ్బులు పంపవద్దు.యూపీఐ ద్వారా నగదు పంపే ముందు వ్యక్తి వివరాలు పూర్తిగా నిర్ధారించుకోవాలి.అడ్వాన్స్, ఎమర్జెన్సీ పేరుతో డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలి.
వ్యక్తిని ప్రత్యక్షంగా కలుసుకుని లేదా పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత మాత్రమే లావాదేవీలు చేయాలి. ఎవరైనా అనుమానాస్పదంగా వ్యవహరిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. అప్రమత్తతే సైబర్ నేరాల నుండి రక్షణ అని తెలిపారు.

## దేవరకొండలో ఘనంగా ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

-విద్యార్థులలో దాగున్న సృజనాత్మకతను వెలికితీసేందుకే సమ్మర్ క్యాంపులు
-ముఖ్య అతిథిగా హాజరైన దేవరకొండ మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు
-విజేతలకు బహుమతుల ప్రదానం.. ఒత్తిడిని జయించేందుకే ఈ శిక్షణ









**దేవరకొండ ( డివిజన్) 25మే (మహాప్రభ):**
విద్యార్థులలో దాగున్న సృజనాత్మకతను మరియు విలక్షణమైన ప్రతిభను వెలుగు తీయడం కోసం వేసవి శిక్షణ శిబిరాలు (సమ్మర్ క్యాంపులు) ఎంతగానో దోహదపడతాయని దేవరకొండ మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు అన్నారు. దేవరకొండ పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 11వ తేదీ నుండి ఘనంగా ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం సోమవారం నాటితో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జరిగిన ముగింపు కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేరుపెల్లి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ ముగింపు వేడుకలకు మండల విద్యాధికారి (ఎంఈవో) మాత్య నాయక్ మరియు మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరం ద్వారా విద్యార్థులు కేవలం ఆటలకే పరిమితం కాకుండా, స్పోకెన్ ఇంగ్లీష్, యోగా, డ్రాయింగ్, మ్యూజిక్, డాన్స్ వంటి విభిన్న సృజనాత్మక రంగాలలో ప్రత్యేక శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. ఈ శిక్షణ వారిలో దాగివున్న నైపుణ్యాలను వెలికితీయడానికి ఒక చక్కని వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. ఇలాంటి శిక్షణా శిబిరాలు విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడంతోపాటు, నిత్య జీవితంలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని సులభంగా జయించేందుకు ఎంతగానో తోడ్పడతాయని చైర్‌పర్సన్ తెలిపారు. విద్యార్థులు ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యాలను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం ఈ శిక్షణ కాలంలో నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ షబానా బేగం, తాటికోల్ హెచ్‌ఎం కే. బక్కయ్య, సీనియర్ ఉపాధ్యాయులు ఏజే విజయ్ కుమార్, నక్క కొండయ్య, కే. ప్రవీణ్, డాన్స్ మాస్టర్ లావణ్య, పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నమస్తే మహాప్రభ
జనరల్ న్యూస్
MAHAA PRABHA NEWS
మంగళవారం 26-05-2026
WWW.MAHAAPRABHA.COM తెలుగు దినపత్రిక


## రాష్ట్ర స్థాయి కరాటే పోటీలో మెదక్ విద్యార్థుల ప్రతిభ.



**మెదక్ జిల్లా -25మే (మహాప్రభ ).**
ఆదివారం నిర్వహించిన సూపర్ ఫైటర్స్ కరాటే ఆధ్వర్యంలో కరాటే పోటీలు కరీంనగర్ లో ఒక్క ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు జరిగాయి. అని కరాటే మాస్టర్ నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీలో మెదక్ పట్టణ విద్యార్థులు సుష్మ శ్రీ, చైతన్య శ్రీ, శ్రీజ, నితన్య శ్రీ,రక్షిత (బంగారు పథకాలు ) అఖిల్, (గోల్డ్ ), అభి నందన్ (గోల్డ్ ), భీంరావ్ (సిల్వర్ ), విహాన్ (సిల్వర్ ), జాశ్విక్ (బ్రోనజ్ ) పథకాలు సాధించారని వారు తెలిపారు, నితన్య సిరి, అఖిల్ ఓవర్ అల్ ఛాంపియన్ షిప్ సాధించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్ సూరబీ వేణుగోపాల్,కరాటే మాస్టర్స్, నవీన్ దినాకర్, నాగేంద్ర,తదితరులు పాల్గొన్నారు.

## గడ్డిఅన్నారం డివిజన్‌లో విద్యుత్ సమస్యకు తక్షణ పరిష్కారం

-ఎల్ టి వైర్ల మరమ్మతు.






**గడ్డి అన్నారం 26 మే (మహాప్రభ)**
బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ఆదేశాలతో నూతన ఎల్ టి వైర్ల మరమ్మతులు పూర్తి గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీ, ఎ.చీశీ.19-8 వద్ద కొబ్బరి చెట్టు కూలిపోవడంతో విద్యుత్ వైర్లు తెగి స్థానికంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలిసిన వెంటనే బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి స్పందించి హైడ్రా డి ఆర్ ఎఫ్ బృందం మరియు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదకరంగా మారిన చెట్టును తొలగించిన అనంతరం తెగిపోయిన పాత వైర్ల స్థానంలో నూతన ూ వైర్లను ఏర్పాటు చేసి మరమ్మతు పనులను పూర్తి చేశారు. దీంతో స్థానిక ప్రాంతంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడింది. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి అధికారులతో కలిసి పనులను పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యపై వెంటనే స్పందించి పరిష్కారం చూపినందుకు స్థానిక కాలనీవాసులు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు మరియు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ లైన్మెన్ సాయి, కాలనీ వాసులు కిషన్, సిద్దు, సతీష్, శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు ఏనుగు శ్రీధర్ రెడ్డి, టీంకు, రఘునందన్ జోషి తదితరులు పాల్గొన్నారు.

## సీజ్ చేసిన భవనంలో మళ్లీ నిర్మాణ పనులు..?

-ఆరు అంతస్తుల భవనంలో పాఠశాల ఏర్పాటుపై స్థానికుల ఆందోళన







**కూకట్పల్లి ,మే 25 ,(మహాప్రభ)**
హైదరాబాద్ నగరంలోని అంజనేయ నగర్ ప్రాంతంలో సీజ్ చేసిన ఓ బహుళ అంతస్తుల భవనంలో మళ్లీ నిర్మాణ పనులు ప్రారంభించడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు అంతస్తులతో నిర్మాణం కొనసాగుతున్న ఈ భవనంలో పాఠశాల ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. స్థానికుల ఆరోపణల ప్రకారం, గతంలో నిబంధనల ఉల్లంఘనల కారణంగా సంబంధిత అధికారులు ఈ భవనాన్ని సీజ్ చేసినట్లు తెలుస్తోంది. అయితే తాజాగా తిరిగి భవనాన్ని తెరిచి నిర్మాణ పనులు ప్రారంభించారని వారు చెబుతున్నారు. భవనం చుట్టూ ఉండాల్సిన ఖాళీ ప్రదేశాలు, భద్రతా ప్రమాణాలు, అనుమతుల అంశాలపై ఇప్పటికీ స్పష్టత లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా విద్యాసంస్థ నిర్వహణకు అవసరమైన అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు ఉన్నాయా లేదా అనే అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద ఎత్తున విద్యార్థులు వచ్చే అవకాశమున్న నేపథ్యంలో అన్ని నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖలు వెంటనే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

- నేనావత్ బాలు నాయక్ .



**దేవరకొండ మే 25 ( మహాప్రభ )**
దేవరకొండపట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో కళ్యాణ లక్ష్మి మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్వయంగా లబ్ధిదారులను పంపిణీ చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ 136 మందికి కళ్యాణ లక్ష్మి మరియు షాదీముబారక్ చెక్కులు ఆయన పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజురు అయిన 200 మంది గాను 80లక్షల 48 వేల 500 రూపాయలు విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు జవీ=ఖీ కింద17 కోట్ల రూపాయలు మంజూరు చేశారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.....ఆపదలో ఉన్న ప్రజలకు సీఎం సహాయనిధి ఒక గొప్ప ఆధారంగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సహాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఇలాంటి సహాయ కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పేద కుటుంబాల అమ్మాయిల వివాహాలకు ఆర్థికంగా అండగా నిలవడం కోసం ప్రభుత్వం కళ్యాణలక్ష్మి మరియు షాది ముబారక్ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకాల ద్వారా పేద కుటుంబాలపై పడే వివాహ ఖర్చు భారాన్ని తగ్గించడం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు తమ కుటుంబాలను సంతోషంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కానుకగా జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చారిత్రాత్మక 'ఇందిరమ్మ జీవిత భీమా' పథకాన్ని ప్రారంభించబోతున్నాము. కులమతాలకు అతీతంగా, పేద ధనిక భేదం లేకుండా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ. 5 లక్షల భీమా రక్షణ కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సోలార్ పవర్ ప్లాంట్ల కేటాయింపుతో పాటు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ. లక్ష కోట్లకు పెంచుతాము. సన్నబియ్యం పంపిణీ, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ ఫలాలను అందిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది అన్నారు సంక్షేమమే ధ్యేయంగా ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ తెలంగాణను ప్రగతిపథంలో నడిపిస్తున్నాము అని అన్నారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు ఎమ్మెల్యే మరియు రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.
ప్రజల విశ్వాసంతో.. అభివృద్ధి, సంక్షేమం, సమానత్వం కలిసిన కొత్త తెలంగాణ చరిత్రను రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాస్తున్నాం అని అన్నారు.
ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా,ప్రజా ప్రతినిధులు,మండల పార్టీ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు,కౌన్సిలర్లు, సర్పంచులు,వివిధ అనుబంధ సంఘాల నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు పక్షపాతి మన ప్రజా ప్రభుత్వం

-సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్
-ఆరు నెలల్లోనే రూ. 21 వేల కోట్ల రుణమాఫీ.
-ఆహార గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన.
-శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్



**దేవరకొండ మే 25 ( మహాప్రభ )**
దేవరకొండ మండలంలోని కొండభీమనపల్లి గ్రామంలో ఆహార దాన్యాల నిల్వ గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ రైతులు పండించిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.
ప్రభుత్వ లక్ష్యం రైతులకు అన్ని విధాలుగా మేలు చేకూర్చడమేనని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. నాడు వరి వేస్తే ఉరి అన్న పాలకులకు భిన్నంగా, నేడు సన్న వడ్ల సాగును ప్రోత్సహిస్తూ మద్దతు ధరతో పాటు అదనంగా రూ. 500 బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు.
రైతులు పండించిన పంటను విక్రయించిన వెంటనే, ఆలస్యం లేకుండా వారి ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద ప్రజలకు నేరుగా చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని, ఆడబిడ్డల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు,స్థానిక సర్పంచ్ శ్రీను,మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా,మండల పార్టీ అధ్యక్షులు లోకాసాని శ్రీధర్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల్ల వెంకటయ్య గౌడ్,గూజం చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి,మాజీ జడ్పీటీసీ అరుణ సురేష్ గౌడ్,మాజీ ఎంపీపీ బిక్కు నాయక్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్, సీనియర్ నాయకులు హన్మంతు వెంకటేష్ గౌడ్,మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి,యువ నాయకులు ఎర్ర కృష్ణ జంబో,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పది రోజుల్లో కొనుగోలు ప్రక్రియను పూర్తి చేస్తాం.

-ప్రతి గింజను కొనుగోలు చేస్తాం..రైతులు అధైర్య పడొద్దు.
-10 కేంద్రాల్లో కొనుగోలు పూర్తి..
-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్ జిల్లా -25మే (మహాప్రభ )**
రైతులు అధైర్య పడద్దని , ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. సోమవారం నర్సాపూర్ మున్సిపాలిటీలోని సాయి కృష్ణ రైస్ మిల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సాపూర్ లో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డి ఎం సి ఎస్ జగదీష్ ,డి ఎస్ ఓ నిత్యానంద్ తాహసిల్దార్ శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లను వచ్చే 10 రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.రైతులకు వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్--అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు కేటాయింపులు కూడా చేపడుతున్నామని తెలిపారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడం, లారీలు.. ఇతర రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం, రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ స్పీకర్ ఏం పద్మ దేవేందర్ రెడ్డి.



**పాపన్నపేట మే25( మహా ప్రభ )**
పాపన్నపేట మండలం నాగ్సన్ పల్లి గ్రామ అధ్యక్షులు శేఖయ్య అన్నా కుమార్తె తొగిట భారతి వివాహం సందీప్ తో మెదక్ పట్టణంలోని హెచ్ కన్వెన్షన్ హాల్లో సోమవారం జరిగింది. ఈ వివాహానికి మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట నాగ్సన్ పల్లి మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, సామెల్, భూపాల్, ప్రసాద్, కిషన్, రాజు, మల్లేష్, కిరణ్ తదితరులు ఉన్నారు.

## ప్రజావాణిలో ప్రజల సమస్యలు విన్న జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్.



**మెదక్ జిల్లా -25మే (మహాప్రభ )**
మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్‌కు వినిపించారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారునితో ఎస్పీ స్వయంగా మాట్లాడి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సీఐలు, ఎస్‌ఐలకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ఫిర్యాదులపై సంబంధిత ఎస్‌హెచ్‌వోలతో ఫోన్‌లో మాట్లాడి వేగంగా స్పందించాలని సూచించారు. ప్రజలకు న్యాయం చేయడంలో పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుందని ఎస్పీ తెలిపారు. ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. చట్ట ప్రకారం ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం అందిస్తామని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయని, ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెరుగుతోందని ఎస్పీ తెలిపారు.

# నాలుగు తరాల ఆత్మీయ సమ్మేళనం

**-చెరుకూరి మామిడితోటలో యర్రా కుటుంబ సంబరలు**



**ఖమ్మం మే 25,(మహాప్రభ)**
ఖమ్మం నగర శివార్లలోని చెరుకూరి వారి మామిడితోటలో ఆదివారం యర్రా కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్దార్‌పల్లి గ్రామానికి చెందిన యర్రా యలయ్య, నాగమ్మ దంపతుల సంతానం, ఐదుగురు కుమారులు యర్రా నాగయ్య,రామస్వామి ,భద్రయ్య, వెంకటాద్రి, చిన్న వెంకన్నల కుటుంబాలు సుమారు 120 మంది సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమ్మేళనంలో యర్రా గురుమూర్తి,యర్రా రమేష్,యర్రా గంగాధర్, యర్రా కొండలు రావు,యర్రా రాజేంద్ర ప్రసాద్ (ఆర్ పి ), యర్రా చిన్న నర్సయ్య, యర్రా నాగరాజు,యర్రా చిన్న వెంకయ్య మరియు ఇతర కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నాలుగు తరాలకు చెందిన మనవలు,మనవరాళ్లు,మునిమనవలు,మునిమనవరాళ్లు అందరూ ఒక్కచోట చేరి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆటలు, పాటలు,సాంస్కృతిక కార్యక్రమాలతో మామిడితోట ప్రాంగణం కోలాహలంగా మారింది. పెద్దల ఆశీస్సులతో చిన్నారుల కేరింతలతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. కుటుంబ పెద్దలు మాట్లాడుతూ, బేధాభిప్రాయాలకు తావులేకుండా అందరం ఐక్యతతో కలిసిమెలిసి ఉండటమే మా తాత యలయ్య మాకు నేర్పిన సంస్కారం. ఇలాంటి కార్యక్రమాలతో కుటుంబ సంబంధాలు మరింత బలపడతాయి. నాలుగు తరాలు ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతో సంతోషంగా, మరువలేని అనుభూతిగా ఉందని అన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేసి,పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. భవిష్యత్తులో కూడా ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు.


# మత్తు పదార్థాల పై మరింత నిఘా పెంచాలి.

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



**మెదక్ జిల్లా -25మే (మహాప్రభ )**
జిల్లాలో మత్తు పదార్థాల పై మరింత నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన మత్తు పదార్థాల నిఘా , నియంత్రణపై సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థలు, హాస్టళ్లు, ప్రజా ప్రదేశాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ అధికారులకు ఆదేశించారు. జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాలు ఇతర నిషేధిత పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ..గ్రామ స్థాయి నుండి పట్టణాల వరకు ప్రజల సహకారంతో సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యానికి, కుటుంబాలకు, సమాజానికి కలిగే నష్టాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యువత మంచి మార్గంలో ముందుకు సాగేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ సి ఈ వో ఎల్లయ్యా, జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్,జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, మత్తు పదార్థాల నియంత్రణ అధికారి చంద్రకళ,డి ఎస్పీ లు ,పోలీసు, ఎక్సైజ్, విద్య, రవాణా ,వైద్య ,ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రామాయంపేట మున్సిపాలిటీ లో జరిగిన అవినీతిపై చర్యలేవి



**రామాయంపేట మే 25 మహాప్రభ**
గత కొన్ని రోజుల క్రితం మున్సిపల్ లో జరిగిన అవినీతిపై ఎమ్మెల్యే. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఇప్పటివరకు చర్యలు ఏలాంటివి తీసుకోలేవన్న ఆరోపణలు ప్రజలలో వేలు వే త్తుతున్నాయి ఇంత అవినీతి జరిగినా పై అధికారులు ,మున్సిపల్ పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు అలాగే సోమవారం. జరిగిన ప్రజావాణిలో రామాయంపేట కు చెందిన ఉద్యమ నాయకురాలు అశ్విని శ్రీనివాస్ గారు మెదక్ జెసి గారికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో అవినీతి జరిగిందా లేదా అనే సమస్యను పరిష్కరించి తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని . అలాగే రామాయంపేట రోడ్డు విస్తరణ కార్యక్రమాలు చేపడుతున్నామని ఇప్పటివరకు మళ్లీ ఏక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్లు గా , ఉన్నదని, రామాయంపేట అభివృద్ధి కి ఎన్నో నిధులు ఎమ్మెల్యే గారు సమకూరుస్తున్న, రామాయంపేట లో ఎక్కడ కూడా ఏ అభివృద్ధి జరగడం లేదని వారు జెసికి వినతిపత్రం అశ్విని శ్రీనివాస్ గారు అందజేశారు ఇకనైనా రామాయంపేటపై దృష్టి పెట్టి అవినీతి జరిగిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు అన్నారు

## తోటపల్లి సత్యనారాయణ మృతి బాధాకరం

**-కుమ్మరి శాలివాహన సంఘం మండల అధ్యక్షులు ఏరుకొండ రాము**



**దేవరకొండ ( డివిజన్) 25మే (మహాప్రభ):**
కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన తోటపల్లి సత్యనారాయణ గారి మృతి బాధాకరమని కుమ్మరి శాలివాహన సంఘం మండల అధ్యక్షులు ఏరుకొండ రాము అన్నారు. సత్యనారాయణ గత కొద్ది రోజులుగా ఆరోగ్యంతో బాధపడుతూ సోమవారం హఠాత్ మరణం చెందారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గారి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాడుగుల యాదగిరి, తోటపల్లి కిరణ్,కూన భానుచందర్, సంపెంగ మురళి, శ్రీశైలం, శ్రీను తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టి కృషి అవసరం.

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



**మెదక్ జిల్లా -25మే (మహాప్రభ )**
జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా జిల్లా స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించాలన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్లపై హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ సి ఈ వో ఎల్లయ్యా,ఆర్ ఒ బీ శాఖ అధికారి వేణు,జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, డి ఎస్పీ లు ,జాతీయ రహదారి అధికారులు ,రవాణా శాఖ, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ కమిషన్లు ,పాల్గొన్నారు.

## అకాల వర్షానికి తడిసి ముద్దైన ధాన్యం కుప్పలు..

**రైతన్న గుండెల్లో గుబులు ధాన్యం ఎప్పుడు కొంటారా అని ఎదురుచూపులు**



**తూప్రాన్, మే 25. (మహాప్రభ)**
మెదక్ జిల్లా తూప్రాన్ మండలం నాగులపల్లి గ్రామంలో సోమవారం కురిసిన భారీ అకాల వర్షానికి రోడ్లపై వరి ధాన్యం కుప్పలు పూర్తిగా వర్షం తాకిడికి తడిసి ముద్దయినయి. దీంతో ఐకెపి సెంటర్ లోకి వర్షం నీరు వచ్చి చేరడంతో వరి ధాన్యం కుప్పలు తడవడం జరిగింది. ప్రభుత్వ అధికారులు గత కొన్ని రోజుల నుండి లారీలు దొరకడం లేదని లేక హమాలీలు లేరని జాప్యం చేయడం జరుగుతుంది. వాతావరణ శాఖ అధికారులు అకాల వర్షాలు పడే సూచనలు ఉన్నాయని సూచించడం జరుగుతుంది అయినా నిర్లక్ష్య వైఖరితో జాప్యం వహించడం సరైన సమయంలో లారీలు దొరకకపోవడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఏదేమైనప్పటికీ అధికారులు అతి త్వరగా అప్రమత్తమై ఐకెపి సెంటర్లో ఉన్న వరి ధాన్యం కుప్పలను అతి త్వరగా కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులుగా సాగుతున్నది ప్రజా పాలన ప్రస్థానం.

**-ప్రగతి ఫలాలను ప్రతి గడపకు చేర్చేవరకు ఆగదు ఈ ప్రయాణం.**

**-శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్**



**దేవరకొండ మే 25 ( మహాప్రభ )**
దేవరకొండమండలంలోని వైదోనివంపు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గ్రామ అభివృద్ధికి గ్రామపంచాయతీ భవనం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన సేవలను సులభంగా అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో ఈ భవనం నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామ ప్రజలకు పరిపాలనా సేవలు ఒకేచోట అందుబాటులోకి రావడం వల్ల పారదర్శకత మరియు వేగం పెరుగుతాయని పేర్కొన్నారు..
గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం నల్లగాసు సరిత - ఎల్లయ్య నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి, ఇంటి యాజమానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, అధికారులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అకుల యేసయ్య పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా -25మే (మహాప్రభ )**
మెదక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు అకుల. యేసయ్య ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి సోమవారం పాతూరు గ్రామానికి చేరుకుని ఆకుల యేసయ్య పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం యేసయ్య భార్యను, కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పిస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు ఎం. లావణ్య రెడ్డి,మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం.అంజ గౌడ్,మాజీ ఎంపీపీ కొత్తపల్లి. కిష్టయ్య, నాయకులు సుదర్శన్, మల్లేష్, ఏసుదాస్, శ్రీశైలం, నరేష్, సిద్ధిరాములు, తిరుపతి, సుధాకర్ తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి.

**--జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్ జిల్లా -25మే (మహాప్రభ ).**
ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలనీ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా వ్యాప్తంగా 120 పిర్యాదులు స్వీకరించారు. అందులో భూ భారతి 38, పెన్షన్ 19, ఇందిరమ్మ ఇండ్లు కోసం 17, ఇతర 46 మొత్తం 120 పిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ప్రజావాణి శాశ్వతంగా దరఖాస్తులను పరిష్కరించి, ఫిర్యాదుదారులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పిర్యాదు దారులకు 13 కౌంటర్లు ఏర్పాటు చేసి శాఖల వారిగా దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో ఎల్లయ్య, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్,డిఆర్డిఓ శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గోనబోయినపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి.

**-ఆర్టీసీ డీఎంకు గ్రామ నాయకుల వినతి.**



**దేవరకొండ ( డివిజన్) 25మే (మహాప్రభ):**
నల్గొండ జిల్లా డిండి మండలం పరిధిలోని గోనబోయినపల్లి గ్రామానికి తక్షణమే ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరుతూ గ్రామ నాయకులు, ప్రజలు సోమవారం దేవరకొండ డిపో మేనేజర్ ని కలిసి వినతి పత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ, పాఠశాల లు నడిచినరోజులలో మాత్రమే బస్సులు నడుస్తాయని, గ్రామంలో సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడం వల్ల వైద్యం కోసం మండల కేంద్రం అయిన డిండికి ,దేవరకొండ పట్టణానికి వెళ్లే రోగులు, వృద్ధులు మరియు కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం మరియు సాయంత్రం వేళల్లో బస్సు సర్వీసులను నడపాలని వారు కోరారు. రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, ప్రమాదకర ప్రయాణాలు చేయాల్సి వస్తోందని డీఎం దృష్టికి తీసుకెళ్లారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించారు.. రూట్లను పరిశీలించి, త్వరలోనే గోనబోయినపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో గోనబోయినపల్లి గ్రామ ముఖ్య నాయకులు గడిగ అర్జున్, రాసాలబద్రి మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# బిజినెస్

## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు..

**- యుద్ధ మేఘాలు తొలగుతాయన్న అంచనాలే కారణమా..?**



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియా లో యుద్ధ మేఘాలు తొలగిపోతాయనే అంచనాల మధ్య సూచీలు లాభాల్లో కదలాడాయి. దాంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 1100 పాయింట్ల వరకు పెరిగింది. సెన్సెక్స్ నేటి ట్రేడింగ్‌లో 76,135 వద్ద మొదలైంది. చివరకు 1,073 పాయింట్ల లాభంతో 76,488 వద్ద ముగిసింది. నిఫ్టీ 312 పాయింట్లు ఎగబాకి, 24 వేల పైన స్థిరపడింది. నిఫ్టీ సూచీలో ఐషర్ మోటార్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, బజాజ్ ఫైనాన్స్, టీఎంపీవీ, లార్సెన్ షేర్లు రాణించాయి. మ్యాక్స్ హెల్త్‌కేర్, ఓఎన్‌జీసీ, హిందాల్కో, నెస్లే, బజాజ్ ఆటో స్టాక్స్ నష్టపోయాయి.యుద్ధం ముగించే విషయమై అమెరికా -- ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఓ కొలిక్కి వస్తున్నాయనే వార్తలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు కాస్త దిగొచ్చాయి. ఒక బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 5.58 శాతం తగ్గి, 97.76 డాలర్లకు వచ్చింది. చమురు ధరలు తగ్గడంతో బ్యాంక్ షేర్లు పెరిగాయి. ఆయిల్ ధరల తగ్గుదల కారణంగా ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుందని, వడ్డీ రేట్లలో స్థిరత్వం వస్తుందని మదుపర్లు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కూడా నేటి లాభాలకు ఓ కారణంగా చెప్పవచ్చు.అమెరికా-భారత్ మధ్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారవుతుందని ఆశిస్తున్నామని యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించడం కూడా మార్కెట్లకు జోష్‌ను ఇచ్చింది. ఈ క్రమంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కూడా 35 పైసల మేర కోలుకుంది. ప్రస్తుతం రూపీ వాల్యూ 95.25 వద్ద స్థిరపడింది.

## భగ్గుమంటున్న బంగారం

**మళ్లీ పెరిగిన పసిడి ధరలు.. తాజా రేట్లు ఇవే!**

హైదరాబాద్
గత కొన్ని రోజులుగా ఒడిదొడుకులకు లోనవుతున్న కమోడిటీ మార్కెట్‌లో బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో వస్తున్న మార్పులు, పెరిగిన డిమాండ్ కారణంగా దేశీయంగా పసిడి రేట్లు భారీగా పుంజుకున్నాయి. గడిచిన కొద్ది రోజులుగా తగ్గుతూ వచ్చిన ధరలు.. ఈరోజు మళ్లీ రివర్స్ అయి కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి.తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో సోమవారం మార్కెట్ రేట్లు ఎలా ఉన్నాయో ఒకసారి చూద్దాం.

**నేటి బంగారం ధరల వివరాలు (10 గ్రాములకు):**

-22 క్యారెట్ల బంగారం (ఆభరణాల తయారీకి వాడేది): రూ. 1,46,100 (తులం ధర)

-24 క్యారెట్ల బంగారం (స్వచ్ఛమైన పసిడి): రూ. 1,59,380 (తులం ధర)

**గమనిక:** స్థానిక జ్యుయలరీ షాపుల్లో ఉండే మేకింగ్ ఛార్జీలు (తయారీ కూలి), జీఎస్‌టీ మరియు ఇతర పన్నుల ఆధారంగా ఈ ధరల్లో కొద్దిపాటి మార్పులు ఉండే అవకాశం ఉంది.




**ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు ఏంటి?**
మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం బంగారం ధరల్లో ఈ హఠాత్తు మార్పులకు ముఖ్యంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి

**1:భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ):** ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణం మరియు రాజకీయ అనిశ్చితి వల్ల పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు.

**2: కేంద్ర ప్రభుత్వ పాలసీలు:** బంగారం దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, పన్నుల మార్పులు కూడా స్థానిక మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి.

**3: రూపాయి విలువ తగ్గడం:** అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ బలహీనపడటం వల్ల కూడా బంగారం ధరలు దేశీయంగా పెరుగుతున్నాయి.కొనుగోలుదారులకు నిపుణుల సూచనధరలు భారీగా పెరుగుతున్నప్పటికీ లాంగ్ టర్మ్ (దీర్ఘకాలిక) పెట్టుబడిదారులకు బంగారం ఎప్పుడూ లాభదాయకంగానే ఉంటుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అయితే పెళ్లిళ్ల సీజన్ ఉన్నందున రిటైల్ మార్కెట్‌లో డిమాండ్ పటిష్టంగానే కొనసాగుతోంది. సామాన్యులు బంగారం కొనే ముందు హాల్‌మార్క్ గుర్తును, ధరల పారదర్శకతను ఖచ్చితంగా సరిచూసుకోవాలని మార్కెట్ వర్గాలు సూచిస్తున్నాయి

## కాస్త బలపడిన కరెన్సీ

**- రూపాయి విలువపై ఆర్ బిఐ గవర్నర్ వివరణ**

**బిజినెస్**
ఇటీవల భారీస్థాయిలో పతనమైన రూపాయి విలువ సోమవారం కాస్త కోలుకుంది. నేటి ట్రేడింగ్‌లో 40 పైసలు పెరిగి 95.20గా ట్రేడ్ అవుతోంది. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం ఖరారయ్యే అవకాశాలున్నట్లు వార్తలు రావడంతో చమురు మంటలు కాస్త చల్లారాయి. దీంతో మన కరెన్సీ కాస్త బలపడింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు మంటలు తదితర కారణాలతో ఇటీవల మన దేశీయ కరెన్సీ రూపాయి విలువ భారీగా పడిపోయిన సంగతి విదితమే. డాలర్‌తో పోలిస్తే రూపాయి దాదాపు 100 మార్క్ దిశగా పతనమయ్యింది. దీనిపై తాజాగా ఆర్‌బిఐ (=దీ×) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందిస్తూ .... కీలక వ్యాఖ్యలు చేశారు. రూపాయి ఓవర్ వ్యాల్యూగా ఉందని అనలేమని, వాస్తవిక విలువ కంటే



తక్కువగా ట్రేడ్ అవుతోందని మాత్రం చెప్పగలమని అన్నారు. రూపాయి విలువకు సంబంధించి ఎలాంటి నిర్దిష్ట మారకపు రేటు స్థాయిని ఆర్‌బిఐ లక్ష్యంగా పెట్టుకోదని సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. అసలు అలాంటి విషయాల్లో కేంద్ర బ్యాంకు ఎలాంటి జోక్యం చేసుకోబోదని తెలిపారు. అయితే, ఊహాజనిత కదలికలు లేదా అధిక అస్థిరతను అరికట్టడానికి మాత్రమే విదేశీ మారక ద్రవ్య ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో ఆర్‌బిఐ జోక్యం చేసుకుంటుందని స్పష్టం చేశారు. మన రూపాయికి ఒక నిర్దిష్ట విలువను సెట్ చేయడం కంటే.. కరెన్సీ మార్కెట్‌ను స్థిరంగా ఉంచడానికే తాము ప్రాధాన్యమిస్తామని ఆర్‌బిఐ గవర్నర్ వివరించారు. అంతర్జాతీయంగా అస్థిరత, చమురు ధరల్లో పెరుగుదల ఉన్నప్పటికీ.. మన దేశ బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ స్థిరంగా ఉన్నాయని సంజయ్ మల్హోత్రా తెలిపారు. విదేశీ సంస్థాగత మదుపర్ల నుంచి రికార్డు స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. మన కరెన్సీ విలువను స్థిరంగా ఉంచేందుకు దిగుమతులను తగ్గించి.. ఎగుమతులను పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇదిలాఉండగా ....

# స్పోర్ట్స్

## శ్రీలంక వైట్‌బాల్ కెప్టెన్‌గా మెండిస్..

**హసరంగ, మలింగకు చోటు..!**

శ్రీలంక వైట్ బాల్ కెప్టెన్‌గా కుశాల్ మెండిస్ ఎంపికయ్యాడు. వెస్టిండీస్ పర్యటనలో వన్డే, టీ20 సారథిగా మెండిస్ వ్యవహరించనున్నాడు. కరీబియన్ గడ్డపై మూడు ఫార్మాట్ల సిరీస్‌కు సోమవారం శ్రీలంక సెలెక్టర్లు స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. టెస్టు జట్టును ధనంజయ డిసిల్వా నడిపించనున్నాడు. గాయం నుంచి కోలుకున్న ఆల్‌రౌండర్ వనిందు హసరంగ వన్డే, టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరఫున రాణిస్తున్న ఇషాన్ మలింగను సైతం వైట్ బాల్ ఫార్మాట్‌కు సెలెక్టర్లు ఎంపిక చేశారు.వెస్టిండీస్ పర్యటనలో శ్రీలంక మూడు వన్డేలు.. మూడు టీ20లు.. రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. జూన్ 3 నుంచి 8 వరకు వన్డేల్లో, ఆపై 12 నంచి 15 వరకూ లంక, విండీస్ జట్లు తలపడుతాయి. జూన్ 25 నుంచి టెస్టు సిరీస్ మొదలవ్వనుంది. అందుకని సెలెక్టర్లు పటిష్టమైన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. మే 26న వెస్టిండీస్‌కు శ్రీలంక బృందం వెళ్లనుంది.

**టెస్టు స్క్వాడ్ :** పథుమ్ నిశాంక, లహిరు ఉడానా, నిశాన్ మధుశనక, దినేశ్ చండీమాల్, పసిందు సూరియబండార, కమిందు మెండిస్(వైస్ కెప్టెన్), సొనాల్ దినుశ, కుశాల్ మెండిస్, ధనంజయ డిసిల్వా(కెప్టెన్), మిలాన్ రత్ననాయకే, ప్రభాత్ జయసూర్య, రమేశ్ మెండిస్, అసితా ఫెర్నాండో, విశ్వా ఫెర్నాండో, లహిరు కుమార, ఇసితా




విజేసుందర, కసున్ రజిత.

**వన్డే స్క్వాడ్ :** పథుమ్ నిశాంక, కుమిల్ మిశర, పవన్ రత్ననాయకే, కుశాల్ మెండిస్(కెప్టెన్), జనిత్ లియనగే, అసలంక, కమిందు మెండిస్(వైస్ కెప్టెన్), రత్ననాయకే, హసరంగ, వెల్లలాగే, థీక్షణ, చమీర, మధుశనక, ఇషాన్ మలింగ, అసితా ఫెర్నాండో, ప్రమోద్ మధుషాన్.

**టీ20 స్క్వాడ్ :** పథుమ్ నిశాంక, కుమిల్ మిశర, లసిత్ క్రూస్పుల్లె, రత్ననాయకే, కుశాల్ మెండిస్(కెప్టెన్), కమిందు మెండిస్(వైస్ కెప్టెన్), శనక, మిలాన్ రత్ననాయకే, హసరంగ, వెల్లలాగే, హసరంగ, వెల్లలాగే, నువాన్ తుషార, బినుర ఫెర్నాండో.

## టీ20లో 200 కొడుతా

**వైభవ్ సూర్యవంశీ**





**ముంబై**
వైభవ్ సూర్యవంశీ భారీ స్టేట్మెంట్ ఇచ్చేశాడు. టీ20ల్లో వ్యక్తిగతంగా 200 పరుగులు సాధించాలనుకుంటున్నట్లు చెప్పాడు. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతను ఈ విషయాన్ని చెప్పాడు. ఐపీఎల్ 2026లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న వైభవ్.. అసాధారణ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఐపీఎల్‌లో దాదాపు ప్రతి బౌలర్‌ను వైభవ్ చితకబాదాడు. ఇక టీ20 క్రికెట్ ఫార్మాట్‌లో డబుల్ సెంచరీ కొట్టిన తొలి బ్యాటర్ కావాలనుకుంటున్నట్లు చెప్పాడు.టీ20 క్రికెట్‌లో ఇప్పటి వరకు విండీస్ బ్యాటర్ క్రిస్ గేల్ అత్యధికంగా 175 రన్స్ చేశాడు. ఆర్సీబీ జట్టు తరపున అతను ఆ స్కోర్ చేశాడు. 2013 ఐపీఎల్ సీజన్‌లో పూణె జట్టుపై ఆ వ్యక్తిగత హయ్యెస్ట్ స్కోర్ చేశాడు. ఇప్పుడు ఆ రికార్డును సూర్యవంశీ బద్దలు చేయాలనుకుంటున్నాడు. చరిత్రాత్మక ఇన్నింగ్స్‌ను టార్గెట్ పెట్టుకున్నట్లు తెలిపాడు. యూట్యూబ్ షో ద స్విచ్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ.. టీ20 క్రికెట్ మ్యాచ్‌లో 200 రన్స్ స్కోర్ చేయాలని ఉందని సూర్యవంశీ తెలిపాడు.

గేల్ ఖాతాలో 175 రన్స్ ఉన్నాయని, ఆ మైలురాయిని దాటాలని ఉందా అని అడ్డగా, అవును ఆ రికార్డును బ్రేక్ చేయాలని ఉందన్నాడు. టీ20 మ్యాచ్‌లో 200 రన్స్ స్కోరు చేయనున్నట్లు తెలిపాడు.ఏదైనా మ్యాచ్‌లో 20 ఓవర్లు ఆడగలిగితే, అప్పుడు కచ్చితంగా ఆ రికార్డును బద్దలు కొడుతానన్నాడు.

## ఐపీఎల్ కప్ ఏ జట్టు గెలుస్తుందో చెప్పేసిన అక్షర్ పటేల్..!

**హైదరాబాద్**
ఐపీఎల్ 2026 ప్లేఆఫ్ స్థానాలు ఖరారైన నేపథ్యంలో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ ఆసక్తర వ్యాఖ్యలు చేశాడు. ఈ సారి కప్ ఏ జట్టు సొంతం చేసుకుంటుందో ముందే చెప్పేశాడు. డీసీ, కేకేఆర్ మ్యాచ్ అనంతరం అక్షర్ మీడియాతో మాట్లాడారు. ప్లేఆఫ్ అర్హత సాధించిన జట్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ అత్యంత బలమైన జట్టు అని, ఈ సారి కప్ సన్‌రైజర్స్ సొంతం చేసుకుంటుందని అక్షర్ పటేల్ అభిప్రాయపడ్డారు. ఎస్ఆర్‌హెచ్‌తో పాటు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్ కూడా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాయి. ఈ క్రమంలో అక్షర్ పటేల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన టాప్ టెన్‌లో ఎస్ఆర్‌హెచ్‌కు చెందిన ముగ్గురు బ్యాటర్లు ఉన్నారు. హెన్రిచ్ క్లాసెన్ 14 మ్యాచ్‌లలో 50.50 సగటు, 159.47 స్ట్రైక్ రేట్‌తో 606 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో మూడో స్థానంలో ఉన్నాడని అక్షర్ గుర్తు చేశారు. ఇషాన్ కిషన్ 14 మ్యాచ్‌లలో





40.64 సగటు, 178.36 స్ట్రైక్ రేట్‌తో 569 పరుగులు చేసి ఆరో స్థానంలో ఉన్నాడు. మరోవైపు, ఓపెనర్ అభిషేక్ శర్మ 14 మ్యాచ్‌లలో 43.31 సగటు, 206.22 స్ట్రైక్ రేట్‌తో 563 పరుగులు చేసి ఏడో స్థానంలో ఉన్నాడు.వీరు చెలరేగితే ఆపడం ఎవరి తరం కాదన్నారు. ఈ సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్ అత్యుత్తమ జట్లలో ఒకటిగా నిలిచింది. వారి దూకుడైన బ్యాటింగ్ విధానం ప్రత్యర్థులను బెంబేలెత్తిస్తుందని పేర్కొన్నాడు. అలాగే ఎస్ఆర్‌హెచ్ బౌలర్లు కూడా బాగా రాణిస్తున్నారు. వారి టాప్ ఆర్డర్ ట్రావిస్ హెడ్, అభిషేక్, ఇషాన్ కిషన్, జట్టుకు మెరుపు ఆరంభాలను అందించి, మిడిల్ ఆర్డర్‌కు స్వేచ్ఛగా ఆడేందుకు అవకాశం కల్పిస్తున్నారు. దూకుడైన వారి బ్యాటింగ్‌ను అడ్డుకోవడం ఏ జట్టుకైనా అంత సలువు కాదన్నారు. అందుకే తాను ఎస్ఆర్‌హెచ్ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలిపారు. కాగా, బుధవారం జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్, ఆర్ఆర్‌తో తలపడనుంది. లీగ్ దశలో ఎస్ఆర్‌హెచ్ 18 పాయింట్లతో మూడో స్థానంలో నిలవగ, ఆర్ఆర్ 16 పాయింట్లతో ముగించింది. మరోవైపు, మంగళవారం ఆర్‌సీబీ, జీటీతో తలపడనున్నది. ఈ మ్యాచ్‌లో ఓడిపోయిన జట్టు ఎస్ఆర్‌హెచ్- ఆర్ఆర్‌ల మధ్య గెలిచిన జట్టుతో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది.



## అందాల గత్తర లేపిన రకుల్.

# దృశ్యం 3' బాక్సాఫీస్ సునామీ..
## కేవలం 58 గంటల్లో రూ.100 కోట్ల మైలురాయి!




ఇండియన్ సినిమా చరిత్రలో అత్యంత విజయవంతమైన సస్పెన్స్-క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీల్లో 'దృశ్యం'కు ప్రత్యేక స్థానం ఉంది. మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, దర్శకుడు జీతూ జోసెఫ్ కలయికలో వచ్చిన తొలి రెండు భాగాలు దేశవ్యాప్తంగా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ నుంచి వచ్చిన 'దృశ్యం 3' బాక్సాఫీస్ వద్ద మరోసారి సంచలనాలు సృష్టిస్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో దూసుకుపోతూ కొత్త రికార్డులకు నాంది పలుకుతోంది.'దృశ్యం 3' చిత్రం మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన కేవలం 58 గంటల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరినట్లు హీరో మోహన్‌లాల్ సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసిన ఆయన, "గత 13 సంవత్సరాలుగా ఈ ప్రయాణంలో మాతో పాటు ఉన్న ప్రతి ప్రేక్షకుడికి ధన్యవాదాలు. మీరు చూపించిన ప్రేమ, నమ్మకం, మద్దతు మమ్మల్ని మరింత ఎమోషన్‌కి గురి చేస్తున్నాయి" అంటూ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ సినిమా మొదటి మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.117.17 కోట్ల గ్రాస్ కలెక్షన్లు సాధించినట్లు తెలుస్తోంది. మాలీవుడ్ చరిత్రలోనే అత్యంత వేగంగా భారీ వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఇది ఒకటిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. బాక్సాఫీస్ వద్ద మాత్రమే కాదు.. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్స్‌లో కూడా 'దృశ్యం 3' దూకుడు కొనసాగుతోంది. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో మూడో రోజు ఏకంగా 3.62 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు మేకర్స్ వెల్లడించారు. వీకెండ్ కావడంతో ఆదివారం కలెక్షన్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొదటి రెండు భాగాలతో పోలిస్తే 'దృశ్యం 3'పై ప్రారంభంలో మిశ్రమ స్పందనలు వచ్చాయి. గత భాగాల్లో ఉన్న సస్పెన్స్, ఇన్వెస్టిగేషన్ ఎలిమెంట్స్ ఈసారి కొంత తగ్గాయని కొందరు అభిప్రాయపడ్డారు. అయితే దర్శకుడు జీతూ జోసెఫ్ ఈసారి కథలో భావోద్వేగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది.జార్జ్‌కుట్టి పాత్రలో మోహన్‌లాల్ మరోసారి తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు ఆయన చేసే పోరాటం, గత సంఘటనల ప్రభావం, పోలీసుల ఒత్తిడి నేపథ్యంలో కథను భావోద్వేగంగా తీర్చిదిద్దిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.

# నెట్‌ఫ్లిక్స్‌లో ధనుష్ కర





కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కర' సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ అదిరిపోయే వార్త చెప్పింది. థియేటర్లలో సందడి చేసిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే మే 28 నుంచి స్ట్రీమింగ్ ప్రారంభం కానుందనే వార్తలు వినిపించగా.. తాజాగా ఈ మూవీ భాషల విషయంలో కూడా అధికారిక స్పష్టత వచ్చింది. కేవలం తమిళ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులను దృష్టిలో పెట్టుకుని నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అందుబాటులోకి తీసుకురానుంది.
తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఈ సినిమాను మే 28 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేయడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు విఘ్నేష్ రాజా తెరకెక్కించిన ఈ చిత్రంలో ధనుష్ 'కరస్వామి' అనే లోకల్ దొంగ పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో మరో డిఫరెంట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. సినిమా థియేటర్లలో విడుదలైనప్పుడు మిక్స్‌డ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. ధనుష్ నటన, యాక్షన్ సన్నివేశాలు మంచి ప్రశంసలు అందుకున్నాయి.

# లక్కీ ఛార్మ్ త్రిష
## ముగ్గురు హీరోలకు బ్లాక్ బస్టర్లు

సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న త్రిష మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. వరుసగా కోలీవుడ్ స్టార్ హీరోల కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఆమె భాగం కావడం ఇప్పుడు అభిమానుల మధ్య ఆసక్తికర చర్చకు దారితీసింది. దీంతో 'త్రిష లక్కీ ఛార్మ్' అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఇటీవల ఓ అభిమాని సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ విపరీతంగా వైరల్ అయింది. ప్రముఖ హీరోలు అజిత్, విజయ్, సూర్య కెరీర్‌లలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించడాన్ని ప్రస్తావిస్తూ.. 'వారి బ్లాక్‌బస్టర్ విజయాల వెనుక త్రిష మ్యాజిక్ ఉంది' అంటూ రాసుకొచ్చాడు. ఈ పోస్టును త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీతో స్పందించింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ప్రస్తుత తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో త్రిష నటించిన 'లియో' సినిమా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రం 2023లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ.600 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు తెలిపాయి. విజయ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఇది నిలిచింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ రూపొందించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో త్రిష కీలక పాత్రలో నటించింది. ఈ సినిమా రూ.248 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి అజిత్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచినట్లు ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న సూర్య.. 'కరుప్పు' (తెలుగులో 'వీరభద్రుడు') సినిమాతో మళ్లీ విజయాన్ని అందుకున్నాడు. ఈ చిత్రంలో త్రిష లాయర్ ప్రీతి పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఈ మూడు సినిమాల్లో కూడా త్రిష హీరోయిన్‌గా కనిపించడంతో.. అభిమానులు ఆమెను 'లక్కీ ఛార్మ్' అంటూ ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం త్రిష తెలుగులో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో నటిస్తోంది. దర్శకుడు వశిష్ట మల్లిడి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ఆమె అవని పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాపై కూడా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




# టాక్సిక్‌లో లేడీ విలన్స్?



సినిమా కలర్‌ఫుల్‌గా ఉండాలంటే అందమైన హీరోయిన్ల అవసరం ఎంతైనా ఉంది. హీరోయిన్ అంటే సినిమాకు ఓ ఆభరణం. కథకు అందాన్ని తేవడంతోపాటు కథను నడిపంచడంలోనూ హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తుంటారు. అయితే.. అదే బాధ్యతను పానిండియా సినిమా 'టాక్సిక్' విషయంలో మరో విధంగా నిర్వర్తిస్తున్నారు అగ్ర కథానాయికలు నయనతార, కియారా అద్వానీ. ఈ సినిమాలో వారిద్దరూ బ్యాడ్యాస్ ఉమెన్‌గా కనిపించబోతున్నారు.పూర్తి నెగెటివ్ షేడ్స్‌తో వీరి పాత్రలు సాగుతాయట. తెరపై వీరి పాత్రలు ఆడియన్స్‌కి కొత్త అనుభూతిని ఇస్తాయట. ఈ విషయాన్ని స్వయంగా చిత్ర కథానాయకుడు యష్ తెలిపారు. 'ఈ తరహా పాత్రల్లో వారిద్దరినీ ఆడియన్స్ ఊహించి ఉండరు. నయన్, కియారా నటన ఈ సినిమాలో నెక్స్ట్ లెవల్లో ఉంటుంది. వారిద్దరి కదలికలే కొత్తగా ఉంటాయి' అని తెలిపారు యష్. ఆయన హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హ్యూమా ఖురేషీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పానిండియా చిత్రం ఈ ఏడాది ఆగస్టులో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది.

# యాక్షన్ మోడ్‌లోకి అక్షయ్



గత కొన్నేళ్లుగా వినోదప్రధానమైన చిత్రాలు, భావోద్వేగ కథలతో ఆడియన్స్‌ని అలరిస్తున్న బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్‌కుమార్ త్వరలో యాక్షన్ మోడ్‌లోకి రానున్నారు. పూర్తిస్థాయి యాక్షన్ సినిమాలో ఆయన నటించి చాలా ఏళ్లయింది. ఆ లోటును భర్తీ చేస్తూ అక్షయ్ చేస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'సముక్'. కనిష్క వర్మ దర్శకుడు. విపుల్ అమృత్‌లాల్ షా నిర్మాత.భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనున్న ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ 'అక్షయ్ పూర్తిస్థాయి యాక్షన్ మోడ్‌లోకి తిరిగి వస్తున్నారు. ఇది ఓ ఏలియన్ సర్వైవల్ థ్రిల్లర్. హారర్ అంశాలతోపాటు, మిలిటరీ రియలిజం కూడా ఇందులో ఉంటాయి. అంతర్జాతీయ సాంకేతిక బృందం ఈ సినిమాకోసం పనిచేయబోతున్నది. 'సముక్' భారతీయ సినీ చరిత్రలో ఇంతకు ముందు రాని ప్రయత్నం' అని తెలిపారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com